http://www.agnidharanews.com

# అగ్నిధార

బుధవారం 5 నవంబర్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## మంత్రి అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ కేటాయింపు

- తెలంగాణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్
- ఆయనకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి
- మైనార్టీ సంక్షేమ శాఖ బాధ్యతల అప్పగింత
- అదేవిధంగా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కేటాయింపు

హైదరాబాద్

రాష్ట్ర మంత్రి అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖ కేటాయించింది. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణస్వీకారం చేసిన నాలుగు రోజులకు అజారుద్దీన్‌కు శాఖ కేటాయించారు. మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి.

**మైనార్టీ సంక్షేమ శాఖతోనే సరిపెట్టిన రేవంత్ రెడ్డి**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముస్లింకు హోంశాఖ ఇచ్చారు. ఇప్పుడు కూడా హోంశాఖను నాకు - మిగతా3లో

## పెట్టుబడుల విషయంలో పూర్తిగా సహకరిస్తాం



- సీఎం రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ బృందం భేటీ
- డేటా సెంటర్లు, విస్తరణపై చర్చ
- హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు సీఎంకు వివరించిన జర్మనీ బృందం
- హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని కోరిన సీఎం
- ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి

హైదరాబాద్

పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం మంగళవారం సీఎంతో భేటీ అయ్యింది. రాష్ట్రంలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ డేటా సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. మరోవైపు జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం కూడా సీఎంతో భేటీ అయ్యింది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు సీఎంకు వివరించింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి మైకేల్ బృందాన్ని కోరారు. జీసీసీ ఏర్పాటుతో రెండేళ్లలో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని జర్మనీ బృందం వెల్లడించింది. - మిగతా3లో



## పరిశోధనల పరంపరలో భారత్ సరికొత్త శకం

- దేశంలో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల కోసం రూ.1 లక్ష కోట్లతో ప్రత్యేక మూలనిధి
- ప్రధానంగా ప్రైవేట్ రంగం పెట్టుబడులు, భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ నిధి ముఖ్య ఉద్దేశం
- పరిశోధనలపై పెట్టుబడి పెరిగినప్పుడు అది నేరుగా మానవ వనరుల అభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రభావాన్ని చూపుతుంది.



## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రైలు ప్రమాదం

- గూడ్స్ రైలును ఢీకొట్టిన కోర్బా ప్యాసింజర్..
- 10 మంది దుర్మరణం
- క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



## లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్ము దోచుకోలేరు

- కేంద్రమంత్రి అమిత్ షా
- మోదీ–నీతీశ్ అభివృద్ధి మోడల్‌కు, ఆర్జేడీ, జంగిల్‌రాజ్‌కు మధ్య పోటీ జరుగుతోంది
- ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బిహార్‌ను సమగ్ర అభివృద్ధి వైపు నడిపిస్తుంది
- ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోనే బిహార్ అభివృద్ధి బాటలో నడుస్తుంది కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఆర్జేడీ నేతలు తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు

## కాంగ్రెస్‌లో సీనియర్లు గుస్సా

- మొత్తం 18 మంత్రి పదవులు ఉండగా.. మొదటగా 11 మందికి పదవులు ఇచ్చారు
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాని అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం ఇప్పుడు కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది
- వ్యూహాత్మక నిర్ణయంగా సమర్థించినా.. సీనియర్ నాయకులు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటికీ పూర్తిస్థాయి కేబినెట్ కొలువుదీరలేదు. మొత్తం 18 మంత్రి పదవులు ఉండగా.. మొదటగా 11 మందికి పదవులు ఇచ్చారు. ఆరు నెలల క్రితం మరో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. తాజాగా అజారుద్దీన్‌కు మైనారిటీ కోటాలో మంత్రి పదవి దక్కింది. ఇక రెండు పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఆశావహులు మాత్రం ఎక్కువగా ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాని అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం ఇప్పుడు కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో అజార్‌ను కేబినెట్‌లోకి తీసుకున్నారు. వ్యూహాత్మక నిర్ణయంగా సమర్థించినా.. సీనియర్ నాయకులు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మంత్రి పదవి ఆశిస్తున్నవారిలో మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ, నేత ఫిరోజ్ ఖాన్ కూడా ఉన్నారు. వీరు కూడా మైనారిటీ కోటాలో పదవి - మిగతా3లో





## యువత 'రీల్స్'లో బిజీగా ఉండాలని మోదీ కోరుకుంటున్నారు

- సీఎం నీతీశ్ కుమార్ యువతను కార్మికులుగా మారుస్తున్నారు
- అన్ని ఉపాధి అవకాశాలను నాశనం చేస్తున్నారు
- "సామాజిక మాధ్యమాలు, రీల్స్ చేయడం వంటివాటికి యువత బానిస కావాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారు
- ఈ ఎన్నికల్లో ఎన్డీయే గెలవదని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాకు తెలుసు
  రాష్ట్రంలో ప్రశ్నపత్రాల లీకేజీలు సర్వసాధారణంగా మారాయి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

## 6 నుంచి ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ

- నవంబర్ 6, 7, 12 మరియు 13 తేదీల్లో విచారణ
- ఇరువైపుల వాదనలు వినను్న స్పీకర్
- ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారణ



హైదరాబాద్

బీఆర్ఎస్ దాఖలు చేసిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి రెండో దశ విచారణను నిర్వహించనున్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద నవంబర్ 6, 7, 12 మరియు 13 తేదీల్లో విచారణ చేపట్టనున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), పోచారం శ్రీనివాస్ రెడ్డి - మిగతా3లో

## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్



- డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం
- రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు
- నివేదిక పంపాలని కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా ఆదేశం

# పరిశోధనల పరంపరలో భారత్ సరికొత్త శకం

పరిశోధన, అభివృద్ధి ఆవిష్కరణల రంగంలో భారత్‌ను విశ్వ గురువుగా నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. దేశంలో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల కోసం రూ.1 లక్ష కోట్లతో ప్రత్యేక మూలనిధి(రిసెర్చ్, డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ ఫండ్-%=ణ×%)ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా ప్రైవేట్ రంగం పెట్టుబడులు, భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ నిధి ముఖ్య ఉద్దేశం. ఈ నిధి భారత్‌ను శాస్త్ర సాంకేతిక హబ్‌గా మార్చడంలో ఎలా ఉపయోగపడుతుందో, వివిధ రంగాలపై దీని ప్రభావం ఎలా ఉండబోతుందో అంచనావేద్దాం. రూ.1 లక్ష కోట్ల ఆర్‌అండ్‌డీ మూలనిధి భారత్‌ను అంతర్జాతీయ శాస్త్ర సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దడంలో కీలకమైన ఉత్ప్రేరకంగా పనిచేయనుంది. ఈ నిధి ద్వారా పరిశోధన ప్రాజెక్టులకు, ముఖ్యంగా 'హై-రిస్క్, హై-ఇంపాక్ట్' (అధిక ప్రమాదం, అధిక ప్రభావం) కలిగిన డీప్‌టెక్ స్టార్టప్‌లకు దీర్ఘకాలికంగా తక్కువ లేదా సున్నా వడ్డీకి రుణాలు లభిస్తాయి. ప్రభుత్వ సంస్థలు అందించే గ్రాంట్‌లతో పోలిస్తే ఇది ప్రైవేట్ సంస్థలకు స్థిరత్వాన్ని ఇస్తుంది.



**ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ**

ఈ నిధులను నేరుగా పరిశ్రమలకు అందించకుండా సెకండరీ లెవల్ ఫండ్ మేనేజర్ల వంటివి) ద్వారా మళ్లించడం వల్ల నిధుల వినియోగంలో పారదర్శకత పెరుగుతుంది. ఇది ప్రైవేట్ వెంచర్ క్యాపిటల్, ఇతర సంస్థాగత పెట్టుబడిదారులను ఆర్ అండ్ డీ రంగంలోకి మరింతగా ఆకర్షిస్తుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్(పరిశోధనను సులభతరం చేయడం) లక్ష్యంగా ఆర్థిక నియంత్రణలు, విధానాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టడం వల్ల ఆవిష్కరణలు వేగవంతమవుతాయి.

క్లీన్ ఎనర్జీ, పర్యావరణం బ్యాటరీలు, శిలాజ రహిత ఇంధనాల అభివృద్ధి. తక్కువ ధర ఎనర్జీ స్టోరేజ్ పరిష్కారాలు, గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికతలు, వాతావరణ మార్పులను తట్టుకునే పరిష్కారాలు.

వ్యవసాయం, ఆహార భద్రత ఆహార భద్రత నుంచి పోషక భద్రత వైపు దృష్టి మళ్లించడం. బయోఫోర్టిఫైడ్ పంటలు, తక్కువ ఖర్చుతో కూడిన సాయిల్ హెల్త్ పరిష్కారాలు, బయో ఎరువుల అభివృద్ధి.

రక్షణ, అంతరిక్ష సాంకేతికత కీలకమైన సాంకేతికతలలో స్వావలంబన (ఆత్మనిర్భరత) సాధించడం. అధునాతన రక్షణ వ్యవస్థలు, దేశీయ డ్రోన్ సాంకేతికత, ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్లు.


**మానవ వనరులు, ఉపాధిపై ప్రభావం**

పరిశోధనలపై పెట్టుబడి పెరిగినప్పుడు అది నేరుగా మానవ వనరుల అభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రభావాన్ని చూపుతుంది. ఆర్ అండ్ డీ కార్యకలాపాలు పెరగడం వల్ల సైంటిస్టులు, ఇంజినీర్లు, డేటా నిపుణులు, డీప్‌టెక్ డెవలపర్లు వంటి అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులకు డిమాండ్ పెరుగుతుంది. ఇది విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయ మేధావులను దేశంలోనే నిలుపుకోవడానికి దోహదపడుతుంది. పరిశోధన ఆధారిత సంస్థలు, స్టార్టప్‌లు వృద్ధి చెందడం వల్ల ఉద్యోగుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడుతుంది. దీనివల్ల విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య సహకారం పెరిగి ప్రామాణికమైన శిక్షణ, విద్య అందుబాటులోకి వస్తుంది. ఇటీవల (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) విద్యలో మహిళల భాగస్వామ్యం (43%తో ప్రపంచ సగటు కంటే ఎక్కువ) గణనీయంగా పెరిగింది. ఈ నిధి మహిళా శాస్త్రవేత్తలకు, ఆవిష్కర్తలకు ఉపాధి అవకాశాల పరంగా కొత్త మార్గాలను తెరిచి సమ్మిళిత ఆవిష్కరణకు తోడ్పడుతుంది. ఈ నిధి మద్దతుతో డీప్‌టెక్ స్టార్టప్‌లు వేగంగా వృద్ధి చెందుతాయి. తద్వారా పరోక్షంగా సేల్స్, మార్కెటింగ్, తయారీ రంగాల్లోనూ వేలాది కొత్త

## మల్టీప్లెక్స్ టికెట్ ధరలపై సుప్రీంకోర్టు ఆందోళన..

# ధరలు తగ్గించకపోతే థియేటర్లు ఖాళీ

దేశంలోని మల్టీప్లెక్స్‌లలో సినిమా టికెట్ ధరలతో పాటు, పాప్‌కార్న్ ఇతర పానీయాల ధరలు ఎక్కువ ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సినిమా టికెట్, పాప్‌కార్న్ ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా నిర్ణయించాలని లేదంటే ప్రేక్షకులు సినిమా హాళ్లకు రావడం మానేసి ఓటీటీలకి మొగ్గు చూపుతారని అప్పుడు థియేటర్లు ఖాళీగా ఉంటాయని ధర్మాసనం హెచ్చరించింది. కర్ణాటక ప్రభుత్వం మల్టీప్లెక్స్ టికెట్ ధరలను రూ. 200లకు పరిమితం చేస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై నేడు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ "మీరు వాటర్ బాటిల్‌కు రూ. 100, కాఫీకి రూ. 700 వసూలు చేస్తున్నారు. ధరలను తగ్గించి, ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా చేస్తే పరిశ్రమ బాగుపడుతుంది. లేకపోతే ప్రేక్షకులు రాక సినిమా హాళ్లు ఖాళీగా మిగిలిపోతాయి" అని ధర్మాసనం వెల్లడించింది. అదే సమయంలో జస్టిస్ నాథ్ మాట్లాడుతూ.. సినిమా బిజినెస్ ఇప్పటికే పడిపోతోంది. ప్రజలు వచ్చి ఆనంద పడేలా మరింత రీజనబుల్‌గా ధరలు ఉండాలి. లేకపోతే థియేటర్లు ఖాళీ అయిపోతాయి అని అన్నారు. టికెట్ ధర రూ. 200 ఉండాలనే హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాన్ని తాము సమర్థిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ%ఔ% ధరలను నిర్ణయించడం తమ పరిధిలోకి వస్తుందని తెలిపారు. "తాజ్ హోటల్ కాఫీకి రూ. 1000 వసూలు చేస్తే, ఆ ధరలను తగ్గించమని తాజ్ హోటల్‌కి చెబుతారా? ఇది కూడా అంతే. టికెట్ ధరలను పెంచుకోవడం అనేది




ఎంచుకునే స్వేచ్ఛకు సంబంధించిన విషయం" అని ఆయన తెలిపారు. మరోవైపు, రోహత్గీ.. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టు పెట్టిన షరతులు ఆచరణకు సాధ్యం కావని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా టికెట్ కౌంటర్లలో డబ్బు చెల్లించి టికెట్లు కొనుగోలు చేసే వారి గుర్తింపు కార్డు (ఐడీ) వివరాలు సేకరించాలన్న ఆదేశాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ రోజుల్లో చాలా టికెట్లు 'బుక్‌మైషో' వంటి ఆన్‌లైన్ వేదికల ద్వారా అమ్ముడవుతున్నాయి. కౌంటర్లలో టికెట్లు అమ్మడం లేదు. పైగా సినిమా టికెట్ కొనడానికి ఎవరైనా ఐడీ కార్డు తీసుకెళ్తారా? అని ప్రశ్నిస్తూ హైకోర్టు ఆదేశాలు అవాస్తవమని వాదించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది స్పందిస్తూ ఒకవేళ ప్రభుత్వం ఈ కేసులో గెలిస్తే ప్రేక్షకులు అధికంగా చెల్లించిన టికెట్ ధర మొత్తాన్ని తిరిగి చెల్లించేం దుకు వీలుగా ఉండేందుకే హైకోర్టు ఆ రూల్ పెట్టిందని వివరణ ఇచ్చారు. ఈ కేసుపై ఇరువైపుల వాదనలు విన్న సుప్రీంకోర్టు ఈ పిటిషన్లపై నోటీసులు జారీ చేసింది. అయితే, హైకోర్టు విధించిన మధ్యంతర షరతులు (టికెట్ కొనుగోలు దారుల ఐడీ వివరాలు సేకరించడం వంటివి) తక్షణమే అమలు కాకుండా వాటిపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## కార్తీక పౌర్ణమి రోజున ఆకాశంలో అద్భుత దృశ్యం..

# కనువిందు చేయనున్న బీవర్ సూపర్ మూన్!

ఖగోళప్రియులకు వింతలను వీక్షించాలని భావించే వారికి గుడ్‌న్యూస్. కార్తీక పౌర్ణమి రోజున ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానున్నది. అంటే నవంబర్ 5న ఆకాశంలో చంద్రుడు సాధారణం కంటే పెద్దగా, మరింత ప్రకాశవంతంగా కనిపించనున్నాడు. దీన్నే బీవర్ సూపర్ మూన్‌గానూ పిలుస్తారు. ఈ సూపర్ అరుదైన ఖగోళ దృగ్విషయం కాగా.. పౌర్ణమి సమయంలో చంద్రుడు తన కక్ష్యలో తిరుగుతూ భూమికి అత్యంత దగ్గరగా చేరడంతో ఈ అద్భుతం దృశ్యం ఏర్పడుతుంది. గతంలో ఇలాంటి అదృశ్యం చైనాలోని చెంగ్డులోని లాంగ్‌క్వాన్ పరత్వ ప్రాంతంలో ఈ దృశ్యం కనిపించింది. ఈ సారి భూమికి చంద్రుడు మరింత దగ్గరగా ఉంటాడు. చల్లని శరదృతువు రాత్రిలో మరింత ప్రకాశవంతంగా ప్రకాశిస్తాడు. ఈ సూపర్‌మూన్ ఈ ఏడాదిలో ఏర్పడనున్న మూడు సూపర్‌మూన్‌లో రెండోది. ఉత్తర అమెరికాలోని స్థానిక తెగల నుంచి బీవర్ సూపర్ మూన్‌గా పేరు వచ్చింది. బీవర్లు శీతాకాలంలో గుహలను నిర్మించే, నదులు గడ్డకట్టే ముందు వేటగాళ్లు ఉచ్చులు వేసే సీజన్‌ను ఇది సూచిస్తుంది. చంద్రుడు భూమి చుట్టూ తిరిగే కక్ష్య పూర్తిగా వృత్తాకారంలో ఉండదు. కానీ, కక్ష్యలో తిరిగే సమయంలో భూమికి చంద్రుడు దగ్గరగా, దూరంగా వెళుతుంటాడు. పౌర్ణమి రోజున చంద్రుడు తన కక్ష్యలో భూమికి దగ్గరగా వచ్చిన దృష్యాన్ని సూపర్ మూన్‌గా పిలుస్తారు. ఈ సమయంలో చంద్రుడు భూమి నుండి దాదాపు 3,57,000 కిలోమీటర్ల దూరంలో ఉంటాడు. ఈ కారణంగా ఇది సాధారణ పౌర్ణమి కంటే ఏడుశాతం పెద్దగా ఉంటుంది. అలాగే, 16శాతం ఎక్కువ చంద్రుడు ప్రకాశవంతంగా కనిపిస్తాడు. చంద్రుడు చేరుకున్న సమయంలో భూమి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యకు దగ్గరగా ఉన్న పెరిజీ దగ్గర ఉన్నప్పుడు సూపర్‌మూన్ సంభవిస్తుంది. శాస్త్రీయ భాషలో దీన్ని పెరిజీ పౌర్ణమిగా పిలుస్తారు. కానీ, ప్రతి సూపర్‌మూన్ ఒకేలా ఉండదు. చంద్రుడు రాత్రంతా ప్రకాశవంతమైన రాశిచక్రం నక్షత్రరాశి వృషభంలో ఉంటాడు. ప్రకాశవంతమైన కాంతి సమీపంలోని నక్షత్రాలను అస్పష్టంగా చేస్తుంది. కానీ, టెలిస్కోప్ ద్వారా చంద్రుడిని చూస్తే నీరింజ, ఎరుపు నక్షత్రం ఆల్డెబరాన్‌ను చూడొచ్చు. ఇది భూమి నుంచి 65 కాంతి సంవత్సరాల దూరంలో ఉంటుంది. చంద్రుడు, ఆల్డెబరాన్ మధ్య ప్లీయేడ్స్ ఉంది. ప్లీయేడ్స్‌ను సెవెన్ సిస్టర్స్‌గా పిలుస్తారు. ఇది బిగ్ డిప్పర్‌ను పోలి ఉండే మెరిసే నక్షత్ర సమూహం. ఇది భూమి నుంచి 330 కాంతి సంవత్సరాల దూరంలో ఉంటుంది. బీవర్ మూన్‌ను చూసేందుకు ప్రత్యేక పరికరాలు అవసరం లేదు. ఆకాశం వైపుగా చూస్తే సరిపోతుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6.49 గంటలకు పూర్ణచంద్రుడు దర్శనమిస్తాడు.



### ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రైలు ప్రమాదం..



ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళుతున్న కోర్బా ప్యాసింజర్ రైలు.. జయరామ్ నగర్ స్టేషన్ వద్ద ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ ఘటనలో 10 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మృతదేహాలను ట్రెయిన్ నుంచి వెలికితీశాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో ఆస్పత్రులకు తరలించాయి. ఘటనా ప్రాంతంలో ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

### లాలూ తాతలు దిగొచ్చినా..
### ఆ సొమ్ము దోచుకోలేరు



బిహార్‌లో జంగిల్‌రాజ్ (ఆటవిక పాలన) తిరిగి రావద్దంటే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కేంద్రమంత్రి అమిత్ షా బిహార్ ఓటర్లను కోరారు. దర్భాంగాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ.. ఇటీవల బిహార్ ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసిన రూ.10వేలను ఉపసంహరించుకోవాలని ఆర్జేడీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని తప్పుబట్టారు. ఆ సొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారంటూ ధ్వజమెత్తారు. లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్మును దోచుకోలేరన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ-నీతీశ్ అభివృద్ధి మోడల్‌కు, ఆర్జేడీ, జంగిల్‌రాజ్‌కు మధ్య పోటీ జరుగుతోందని అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బిహార్‌ను సమగ్ర అభివృద్ధి వైపు నడిపిస్తుందన్నారు. బిహార్‌లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి వస్తే 'మిథిలాంచల్'కు సాగునీరు అందించడానికి, ఆ ప్రాంతంలో వరదలను అరికట్టడానికి, కోషి నది నీటిని ఉపయోగించుకోవడానికి మొత్తం రూ.26,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్నారు.

**ఎన్డీఏతోనే బిహార్ అభివృద్ధి.. రాజ్‌నాథ్ సింగ్**

ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోనే బిహార్ అభివృద్ధి బాటలో నడుస్తుందని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వైశాలి జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఆర్జేడీ నేతలు తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి కావాల్సిన డబ్బు వారికి ఎక్కడినుంచి వస్తుందని ప్రశ్నించారు. యూపీఏ పాలనలో, కేంద్రం బిహార్‌కు రూ.2 లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని.. ఎన్డీఏ పాలనలో మోదీ ప్రభుత్వం పదేళ్లలో రూ.15 లక్షల కోట్లు విడుదల చేసిందన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడం గురించి ఎన్డీఏ మాత్రమే ఆలోచించగలదని ఆర్జేడీ కాదని విమర్శించారు.

### యువత 'రీల్స్'లో బిజీగా
### ఉండాలని మోదీ కోరుకుంటున్నారు



**ఇంటర్నెట్ డెస్క్:** సమస్యల నుంచి దృష్టి మళ్లించేలా.. యువత సోషల్ మీడియా రీల్స్‌లో బిజీగా ఉండాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. సీఎం నీతీశ్ కుమార్ యువతను కార్మికులుగా మారుస్తున్నారని, అన్ని ఉపాధి అవకాశాలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. "సామాజిక మాధ్యమాలు, రీల్స్ చేయడం వంటివాటికి యువత బానిస కావాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారు. ఇది 21వ శతాబ్దపు కొత్త మత్తు. యువతను పరధ్యానంలో ఉంచేసి.. విద్య, ఆరోగ్యం, ఉపాధి తదితర రంగాల్లో సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండేలా ఇలా చేస్తున్నారు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే గెలవదని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాకు తెలుసని, అందుకే ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ దిల్లీ పెద్దల ఆదేశాల ప్రకారం పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రశ్నపత్రాల లీకేజీలు సర్వసాధారణంగా మారాయని, దీంతో సంపన్న విద్యార్థులు లాభపడుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తమ కూటమి అధికారంలోకి వస్తే పేదల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా మార్చాలనుకుంటున్నట్లు తెలిపారు. వస్త్రాలు, మొబైల్ ఫోన్‌లపై 'మేడ్ ఇన్ బిహార్' చూసి ప్రపంచం ఆశ్చర్యపోతుందన్నారు. నలందాలో అత్యాధునిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్ర వైభవాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

# పెట్టుబడుల విషయంలో పూర్తిగా సహకరిస్తాం

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని సీఎం కోరారు. జర్మనీ టీచర్లను నియమించి విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ.. జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రాజెక్టులను విస్తరించాలని, ఆ కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ బృందం మంగళవారం సచివాలయంలో రేవంత్ రెడ్డితో భేటీ అయింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఏడబ్ల్యూఎస్ ప్రాజెక్టు పనులు, విస్తరణ ప్రణాళికలపై సీఎంతో వారు చర్చించారు. రాష్ట్రంలో ఏడబ్ల్యూఎస్ కంపెనీ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ : మరోవైపు జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం కూడా సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యింది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా రాజధాని నగరం హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్?లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని రేవంత్ రెడ్డి మైకేల్ బృందాన్ని కోరారు. జీసీసీ ఏర్పాటుతో రెండేళ్లలో సుమారు వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని జర్మనీ బృందం వెల్లడించింది. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని సీఎం వారిని కోరారు. జర్మనీ టీచర్లను ఇక్కడ నియమించి విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ ఎల్లప్పుడూ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని సీఎం తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం

## కూలీలకు రూ.600, విద్యార్థులకు రోజుకు రూ.1000

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంతో దినసరి కూలీల అడ్డాలు ఖాళీగా మారాయి. రాజకీయ పార్టీలు ప్రచారానికి, పోస్టర్ల అంటించడానికి దినసరి కూలీలను వినియోగించుకుంటున్నాయి. రోజుకు రూ. 400-800 వరకు చెల్లిస్తూ, భోజనం కూడా పెడుతుండటంతో కూలీలు ఎన్నికల ప్రచారానికే మొగ్గు చూపుతున్నారు. విద్యార్థులకు కూడా ఇంటింటి ప్రచారం, ఓటర్ల జాబితా పరిశీలన పనులకు గాను రూ. 1000 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో విద్యార్థులు, దినసరి కూలీలు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికకు సమయం దగ్గర పడుతోంది. దీంతో పార్టీలన్ని ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచాయి. ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం.. సభలు, సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో అన్ని పార్టీల నేతలు ఫుల్లు బిజీగా ఉన్నారు. ఉప ఎన్నిక నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కార్మికుల అడ్డాలు వెలవెలబోతున్నాయి. మొన్నటి వరకు ఉదయం 8 గంటల కల్లా కూలీలతో రద్దీగా ఉండే పలు ప్రాంతాలు.. గత కొన్ని రోజులుగా ఖాళీగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే..సాధారణ రోజుల్లో ఇక్కడ ఉదయం 8 గంటల వరకే కూలీలు వచ్చి.. పని ఇచ్చే వారి కోసం ఎదురు చూసేవారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమాలు మొదలైన నాటి నుంచి పరిస్థితి మారింది. అడ్డాల మీద కూలీలే కనిపించడం లేదు. కారణం.. రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాల కోసం దినసరి కూలీలను వినియోగించుకోవడం. ఎన్నికల ప్రచారానికి వెళ్లే నాయకుల వెంట పెద్ద సంఖ్యలో జనాలు ఉండేలా పార్టీలు శ్రద్ధ పెడుతున్నాయి. అలానే పార్టీలు జెండాలు మోయడం కోసం.. పోస్టర్లు అంటిచే పనికి కూడా జనాలు అవసరం. వీటన్నింటి కోసం పార్టీలు దినసరి కూలీలను వినియోగించుకుంటున్నాయి. పైగా వారికి కూలీ డబ్బుతోపాటు భోజనం కూడా పెడుతుండటంతో..చాలా మంది కూలీలు అడ్డాల దగ్గరకు వెళ్లకుండా నేరుగా పార్టీ కార్యాలయాలకే వెళ్లిపోతున్నారు. ఉప ఎన్నిక నేపథ్యంలో..



నియోజకవర్గంలోప్రతి రోజు రెండు పూటలా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ప్రచారానికి వచ్చిన వారికి రూ.400 నుంచి రూ.600 వరకు ఇస్తున్నారు. అలానే ఒక పూట ప్రచారంలో పాల్గొంటే రూ.200-రూ.300 వరకు కూలీ ఇస్తున్నారు. ఓ పార్టీ అభ్యర్థి అయితే ఏకంగా రోజుకు రూ.800 కూడా ఇస్తున్నట్టు తెలిసింది. అభ్యర్థి, పార్టీ నేతలు ప్రచార సమయంలో తమ వెంట 100 మందికి తగ్గకుండా జనం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. కష్టపడి పని చేసే అవసరం లేకుండా.. ఇటు డబ్బుకి డబ్బు, అటు కడుపు నిండా భోజనం లభిస్తుండడంతో కూలీలూ ప్రచార పనికే మొగ్గు చూపుతున్నారు. దినసరి కూలీలను మాత్రమే కాక.. విద్యార్థులను కూడా ప్రచార కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులనుకు పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ లిస్ట్ ఇచ్చి ఇంటింటికి పంపి.. పరిశీలన చేసే పనిని అప్పగిస్తున్నాయి పార్టీలు. దీనిలో భాగంగా విద్యార్థులు తమకు కేటాయించిన బూత్‌లో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి.. అక్కడ ఓటర్ ఉన్నాడా లేదా అని చెక్ చేసి.. వారి పేరుపై టిక్ చేసుకుంటున్నారు. అలానే మొబైల్ నంబర్ కూడా తీసుకుంటున్నారు. ఇందుకు గాను విద్యార్థులకు రోజుకు రూ.1000 చొప్పున పార్టీలు చెల్లిస్తున్నాయి.

# కోకాపేటలో మళ్లీ భూముల వేలం

**హైదరాబాద్ :** హెచ్ఎండీఏ భూముల అమ్మకాలకు మంచి స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరిన్ని స్థలాలను వేలం వేయడానికి సిద్ధమవుతోంది. కోకాపేట, కూకట్‌పల్లిలో 47 ఎకరాల భూమిని వేలం వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కోకాపేటలో ఎకరా ప్రారంభ ధర రూ.99 కోట్లు, కూకట్‌పల్లిలో రూ.75 కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.4,000 కోట్లు సమకూరే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. హెచ్ఎండీఏ పరిధిలోని స్థలాల అమ్మకాలకు.. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. దీంతో మరిన్ని స్థలాలను వేలం వేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా కోకాపేట, కూకట్‌పల్లి ప్రాంతాల్లో హెచ్ఎండీఏ భూములు వేలం వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇంతకుమందు కోకాపేటలో భూముల వేలానికి అనూహ్య స్పందన వచ్చింది. ఎకరం రికార్డు స్థాయిలో ధర పలికిన విషయం తెలిసిందే. త్వరలో వేలం వేసే స్థలాలు ఎంత ధర పలుకుతాయి అన్న విషయంపై ఆసక్తి నెలకొంది. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాలైన కోకాపేటలోని నియోపోలీస్, కూకట్‌పల్లి పరిధిలో ఉన్న మూసాపేట వై జంక్షన్ వద్ద భూముల అమ్మకానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాంతాల్లో మొత్తం 47 ఎకరాల భూమిని వేలం వేయనున్నట్లు తెలుస్తోంది. కోకాపేట నియో పోలీస్‌లో 32 ఎకరాలు, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద 15 ఎకరాల భూమి అమ్మకానికి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. కోకాపేట నియోపోలీస్‌లో ఎకరా ప్రారంభ ధర రూ. 99 కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. ఇక కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఎకరా ప్రారంభ ధర రూ. 75 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భూముల వేలం ద్వారా దాదాపు రూ. 4,000 కోట్లు వచ్చే అవకాశం



ఉందని ప్రభుత్వం అంచనా వేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో జరిగే ఈ వేలం పాటను నవంబర్ 24, 28.. డిసెంబర్ 3, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కోకాపేటలోని నియోపోలిస్‌లో 25 ఎకరాల భూమిని వేలం వేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమవుతున్నట్లు.. దీని ద్వారా రూ.3 వేల కోట్ల ఆదాయం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఇప్పుడు 32 ఎకరాలు వేలం వేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై హెచ్ఎండీఏ స్పష్టత ఇవ్వాల్సి ఉంది. 2022లో కోకాపేట నియోపోలీస్‌లో జరిగిన వేలంలో ఎకరా రూ.100.75 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ఒకవేళ ఈసారి వేలం జరిగితే కూడా భారీ స్పందన ఉంటుందని అంచనాలు ఉన్నాయి. మరోవైపు, గత నెలలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించింది. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన రాయదుర్గంలో.. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన వేలంలో ఎకరం భూమికి రికార్డు స్థాయిలో రూ.177 కోట్లకు అమ్ముడుపోయింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించిన వేలాల్లోనే అత్యధిక ధర కావడం

## 6 నుంచి ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ

-మొదటిపేజీ తరువాయి

(బాన్సువాడ), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి)లను అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్లపై విచారణ జరగనుంది. స్పీకర్ ఇరువైపుల వాదనలు వింటారు. తొలుత పిటిషనర్లు, ఆ తర్వాత ప్రతివాదులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. రోజుకు ఇద్దరు చొప్పున విచారణ జరగనుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కెమెరాల సమక్షంలో విచారణ కొనసాగుతుంది. మొదటి దఫా విచారణ సెప్టెంబర్ 29, అక్టోబర్ 1, అక్టోబర్ 24 తేదీల్లో జరిగింది. ప్రకాశ గౌడ్, కాలే యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను విచారించారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో అనర్హత పిటిషన్లను విచారించడం ఇదే మొదటిసారి.

## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద కంకర లోడుతో వస్తున్న టిప్పర్... బస్సును ఢీకొనడంతో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను సైతం నివేదిక పంపాలని ఆదేశించింది. ప్రమాద సమయంలో ట్రక్కులోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక వారు మృతి చెందారు.

## మంత్రి అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ కేటాయింపు

-మొదటిపేజీ తరువాయి

కేటాయించి ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలి' అని అజారుద్దీన్ సీఎం రేవంత్‌ను కోరినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తనకు హోం శాఖ ఇస్తేనే ముస్లిం మైనార్టీలు ప్రభుత్వాన్ని నమ్ముతారని, జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అనవసర చర్చలకు తావులేకుండా శాఖల కేటాయింపు వీలైనంత త్వరగా ముగించాలని అజారుద్దీన్ కోరినట్టు తెలిసింది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న కీలక శాఖలు ఎవరికీ ఇచ్చేది లేదని, మైనార్టీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని చెప్పినట్టు సమాచారం. జూబ్లీహిల్స్‌లో ఓడినా పోయేదేమీ లేదు.. హోంశాఖ మాత్రం ఇంకొకరికి ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పినట్టు ప్రచార అవుతున్నది. ఆ మేరకే అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్‌లో సీనియర్లు గుస్సా

-మొదటిపేజీ తరువాయి

ఆశించారు. కానీ ఆ ప్లేస్ భర్తీ కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక అంజన్ కుమార్ యాదవ్ జూబ్లీహిల్స్ నుంచి రేసు తప్పుకున్నప్పటికీ, తన కష్టం మర్చిపోయారని అసంతృప్తిగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దం పాటు పోరాడి కూడా పక్కనబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు చర్చ లేకుండా అధిష్టానం నిర్ణయం తీసుకోవడంపై పార్టీలోని చాలా మంది గుర్రుగా ఉన్నారు. అధిష్టానం ప్రకారం, మైనారిటీ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వడం అవసరమని భావించి అజారుద్దీన్‌ను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. అయితే, పార్టీ అంతర్గత వర్గాలు ఈ సాకును ప్రశ్నిస్తున్నాయి. ప్రాతినిత్యం పేరుతో ఓటమి పొందిన అభ్యర్థికి పదవి ఇవ్వడం ప్రోత్సాహకమా, లేక పార్టీ క్రమశిక్షణకు భంగమా అన్న దానిపై చర్చ మొదలైంది. దీనినినే ఇప్పుడు నేతలంతా తప్పుపడుతున్నారు. ఇక నామినేటెడ్ పోస్టుల విషయంలోను సీనియర్లలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మధుయాష్కీ గౌడ్, జగ్గారెడ్డి వంటి నేతలు ఎమ్మెల్యేలను తప్ప ఇతరులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది సీనియర్ సభ్యులు మీడియాకు ఆఫ్‌ద రికార్డ్‌గా, పార్టీ జూబ్లీహిల్స్‌లో ఓడిపోవడం అజారుద్దీన్ వైరివిధానం అని గుసగుసలాడుతున్నారు. ఈ వివాదం రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త శక్తి సమీకరణలకు తెరతీసే అవకాశముందని భావిస్తున్నారు. మొత్తంగా అజార్ మంత్రి పదవి మరోసారి కాంగ్రెస్‌లో సీనియర్?యువ వర్గాల మధ్య చిచ్చు పెట్టింది. అధిష్టానం ఎలాంటి సమీక్ష చేపట్టి అసంతృప్తులను చక్కదిద్దుతుందనే దానిపైనే పార్టీ అంతర్గత ఐక్యత ఆధారపడి ఉంటుంది.



## తులం బంగారం వదిలేయండి పొన్నానికి షాకిచ్చిన ఓటర్లు

**హైదరాబాద్ :** కప్పుడు ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవారు.. కానీ ఇప్పుడు సమస్యల పరిష్కారాన్ని పక్కనపెడుతున్నారు. అసలు సమస్యను ప్రస్తావించడానికి కూడా నాయకులు ఒప్పుకోవడం లేదు. కేవలం సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారు. ఉచితంగా బియ్యం.. ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం.. ఉచితంగా విద్యుత్తు.. ఉచితంగా గ్యాస్.. పింఛన్లు పంపిణీ చేస్తూ రాష్ట్ర ఖజానాలను దివాలా తీయిస్తున్నారు. దీంతో బడ్జెట్ మొత్తం అప్పులకు.. వడ్డీ చెల్లింపులకు.. సంక్షేమ పథకాలకు మాత్రమే సరిపోతుంది. దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే డబ్బులు లేకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకు పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఈ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చింది. అందులో ప్రధానమైనది కళ్యాణ లక్ష్మి పథకం లో భాగంగా ఆడవాళ్లకు లక్ష రూపాయలు చెక్కుతో పాటు, తులం బంగారం కూడా ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ.. ఇప్పటివరకు కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వం తులం బంగారం ఇవ్వలేకపోయింది. కేవలం ప్రభుత్వం ద్వారా వచ్చే లక్ష రూపాయల చెక్కును మాత్రమే అందిస్తోంది. దీనిపై ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. అలవికాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తోంది. ఇదే విషయాన్ని ఓ ప్రైవేట్ న్యూస్ ఛానల్ లో పనిచేసే సీనియర్ జర్నలిస్టు ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా.. తెలంగాణ ప్రభుత్వంలో కీలకమైన శాఖకు మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ను ప్రశ్నించారు. దీనిపై పొన్నం ప్రభాకర్ నీళ్లు నమిలారు. బంగారం తులం ధర లక్ష రూపాయలకు మించి ఉండడంతో తాము ఆ హామీని అమలు చేయలేకపోతున్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇప్పుడంటే తులం బంగారం ధర లక్షకి మించి ఉంది. కానీ సరిగా రెండు సంవత్సరాల క్రితం బంగారం ధర ఈ స్థాయిలో లేదు. అయినప్పటికీ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం బంగారాన్ని ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారుల్లో ఆగ్రహా వేషాలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి కల్యాణ లక్ష్మికి ప్రతి ఏడాది బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి.. వాటి ఆధారంగానే ఖర్చులు జరుగుతుంటాయి. వాటి గురించి తెలిసి కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు తులం బంగారం హామీ ఇవ్వడం విశేషం. పైగా ఆ హామీని నిలబెట్టుకోలేక ఇప్పుడు నానా తంటాలు పడుతుండడం గమనార్హం. పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను గులాబీ పార్టీ సోషల్ మీడియా విభాగం విపరీతంగా సర్కులేట్ చేస్తోంది. ఇది కాంగ్రెస్ పార్టీ నాయకుల అసలు ముఖచిత్రం అంటూ ఆరోపిస్తోంది.

## సంపాదకీయం

# సునామీలతో మానవాళికి ముప్పు

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్రకారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహీ అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో "వరల్డ్ సునామీ అవేర్నెస్ డే" వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5%-%6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్‌తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ ఫోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల ద్వారా సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

# సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని పరిహారం ఉండాలి



మొంథా తుఫాన్ రెండు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేసింది. అపారంగా పంటలకు నష్టం జరిగింది. రోడ్లు, భవనాల శాఖకు, విద్యుత్ సంస్థకు అపార నష్టం జరిగింది. నదులు, వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగి అనేక చోట్ల గండ్లు పడ్డాయి. వందలాది గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అనేక ఇళ్లు నేల కూలాయి. వేల కోట్లలో నష్టం జరిగింది. తెలంగాణలో వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, హనుమకొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, జనగాం, కరీంనగర్ మొదలైన జిల్లాల్లో 2.5 లక్షల ఎకరాల్లో వరి, 1.51 లక్షల ఎకరాల్లో పత్తితో పాటు మిర్చి, మొక్కజొన్న మొదలైన పంటలు 5 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. క్షేత్రస్థాయి పరిశీలనలో పంటల విస్తీర్ణత ఇంకా ఎక్కువగా ఉంటుంది. పంట నష్టంతోపాటు రెండు డిస్కంల పరిధిలో విద్యుత్ సంస్థకు 10 వేల కోట్ల దాకా నష్టం జరిగింది. 4,576 కిలోమీటర్ల మేర రహదార్లు దెబ్బతిన్నాయి. 302 కల్వర్టులు ధ్వంసమయ్యాయి. రహదారుల మరమ్మతు లకు 2,713 కోట్ల అవసరమని ఆర్ అండ్ బి శాఖ మంత్రి పేర్కొన్నారు. తుఫాన్ వల్ల జరిగిన మొత్తం నష్టం రూ. 5,265 కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. నష్టం ఇంకా పెరుగుతుంది. తెలంగాణలో పంట కాల్వల, మురుగు కాల్వల నిర్వహణ సరిగా లేకపోవటం, ముళ్లకంపలు, పూడికలతో కాల్వలు నిండి ఉండటం వల్ల వరదలు, భారీ వర్షాలు వచ్చినప్పుడు కాల్వలకు గండ్లు పడి పంటలు ముంపునకు గురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మురుగు నీటి కాల్వలే లేవు. తెలంగాణ ప్రభుత్వం ఎకరా పంటకు నష్ట పరిహారంగా 10 వేల రూపాయలు ప్రకటించింది. ఇది రైతుకు ఊరటనివ్వదు. ఎకరా సేద్యానికి రూ. 35 వేలకు పైగా రైతు పెట్టుబడి పెట్టాడు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే పరిహారం రైతు నిలదొక్కుకోవటానికి ఉపయోగపడదు. రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని కనీసం ఎకరాకు రూ. 20 వేల పరిహారం ఇవ్వాలి. కౌలు రైతులకు పరిహారమే లభించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు మొదలగు జిల్లాల్లో మొంథా తుఫాన్‌వల్ల లక్షా, 38 వేల హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందని, 12,215 హెక్టార్లలో ఉద్యాన వన పంటలు దెబ్బతిన్నాయని, ఆక్వారంగంలోని 32 వేల ఎకరాల్లో రైతాంగం నష్టపోయారని, 2,261 పశువులు చనిపోయాయని, 4,794 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్ల, కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయని, 311 కల్వర్టుల, వంతెనలకు నష్టం వాటిల్లిందని, విద్యుత్ సంస్థకు అపారంగా నష్టం జరిగిందని, మొత్తం నష్టం 5,244 కోట్ల రూపాయలగా ప్రాథమిక అంచనాను కూటమి ప్రభుత్వం కేంద్రానికి పంపింది. క్షేత్ర స్థాయి పరిశీలనలో నష్టం చాలా ఎక్కువ ఉండే పరిస్థితి ఉంది. అనేక చెరువులు, వాగులకు గండ్లు పడి పంటలతోపాటు వందలాది గ్రామాలు నీటమునిగాయి. అనేక చోట్ల రాకపోకలు స్తంభించి పోయాయి. వరదలకు కొద్ది మరణాలు సంభవించాయి. ఆంధ్రప్రదేశ్‌లో పంటల నష్టంపై భిన్నాభిప్రాయా లున్నాయి. 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, కూటమి ప్రభుత్వం పంట నష్టాన్ని తక్కువ చేసి చెబుతుందనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వ పంట నష్టం తక్కువగా చెప్పడం ద్వారా రైతులకు నష్టపరిహారం కింద ఇచ్చే మొత్తాన్ని తగ్గించుకోవడం కోసమేననే అభిప్రాయాలు వస్తున్నాయి. పంటలు కోల్పోయిన రైతాంగానికి ఇచ్చే పరిహారం కూడా, వారికి ఊరట ఇవ్వటం లేదు. రైతు ఇప్పటికే ఎకరాకి రూ. 35 వేలు దాకా సేద్యానికి పెట్టుబడి పెట్టాడు. కౌలు రైతులు అదనంగా మరో రూ. 15 వేలు కౌలు రూపంలో చెల్లించాడు. ప్రభుత్వం ప్రకటించే నష్ట పరిహారం ఎకరాకు ఎంత అన్నది ఇంకా ప్రకటించలేదు. కనీసం ఎకరాకి రూ. 20 వేలు నష్ట పరిహారం ప్రకటించాలి. కౌలు రైతులకు నష్ట పరిహారం సమస్యగా మారింది. వైసిపి పాలన కాలంలో పంటల బీమా పథకానికి ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించడం వల్ల పంట నష్టానికి కొంత మేరకు పరిహారం అందేది. కారణం తెలియదు గాని చంద్రబాబు ప్రభుత్వం రైతాంగం తరపున ఈ సంవత్సరం ప్రీమియం చెల్లించలేదు. ఫలితంగా బీమా సంస్థల నుంచి రైతాంగానికి పరిహారం లభించక నష్టపోతున్నారు. బీమా పరిహారం లభించి ఉంటే, అది రైతుకు ఉపయోగం ఉండేది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇప్పటికే రైతులకు రూ. 595 కోట్లు కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సిఉంది. పంటలు ముంపునకు గురైనప్పుడు, రైతాంగం నుండి ఎటువంటి వంకలు పెట్టకుండా మద్దతు ఇచ్చి ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేయాలి. మొంథా తుఫాన్ గురైన రైతుల నుండి పంట కొనుగోళ్లు చేయాలంటే, పంట నష్ట పరిహారం కోసం పేర్లు నమోదు చేసుకోరాదని, చేసుకుంటే నష్ట పోగా మిగిలిన పంటను మిల్లర్లు ఇచ్చే రేటుకు అమ్ముకోమని, కొనుగోలు కేంద్రాల్లో కొనే అవకాశం లేదని అధికారులు కొన్ని ప్రాంతాల్లో రైతులకు తెగేసి చెబుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముంపునకు గురైన పంటలకు మద్దతు ధర ఇచ్చే అవకాశం లేదని మిల్లర్లు చెబుతున్నారు. అలాంటప్పుడు మిల్లర్లు ఇచ్చిన ధరకే రైతులు అమ్ముకోవాలి. ఫలితంగా రైతు తీవ్రంగా నష్టపోతాడు. రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ప్రతి సంవత్సరం సంభవిస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వరదలు రావటానికి, పంటలు ముంపుకి గురి కావటానికి కారణమైన నదుల, వాగుల, కాల్వల, చెరువుల కరకట్టలను పటిష్ట చేయడం, పూడికలు తీయడం, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చు. వీటి పట్ల రాష్ట్ర పాలకులు దృష్టి పెట్టకపోవడం వల్ల తుఫాన్ల సందర్భంగా పంటలకు అపార నష్టం జరుపుతున్నది. రెండు రాష్ట్రాల్లో తీవ్ర సంక్షోభంలో ఉన్న రైతాంగం, మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయి మరింత సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. కౌలు రైతులతోసహా నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ. 20 వేలు ఇవ్వాలి. ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతుల నుండి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకులు ఇచ్చిన పంట రుణాలు రద్దు చేయాలి. పంటకాల్వల, డ్రైనేజీ కాల్వలను ఆధునీకరణ చేయాలి. సహాయం పొందడం పాలకుల భిక్షకాదని, అది తమ హక్కు అని రెండు రాష్ట్రాల రైతాంగం సాధనకు ఉద్యమించాలి.

# సాహితీ మహారథి దాశరథి



"నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించి నిజాంపాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి..." ఓ నిజాము పిశాచమా? కానరాదు / నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూపళ్ళు తోముకోవడా నికిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా ) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగించిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. 'నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద' అని ఆయన నినదించారు. 'ననుగని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ' అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. 'అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం అనాథునికీ ఆగర్భ శ్రీమంతునికీ మధ్య' అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథి గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. "మా నిజాం రాజు జన్మజన్మల బూజు".రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్' అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహా సభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. . మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగస్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. "అగ్ని ధారను తన జైలు సహవాసి.. వట్టికోట అళ్వారు స్వామికి అంకితమిచ్చాడు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చాడు. ఈయన రాసిన 'తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. 'కవితా పుష్పకం' అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాశరథి 'బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును' రాశారు. గీతగోవింద వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు. రుద్రవీణ, మహాంద్రోదయం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం ). మస్తిష్కంలో లేబరేటరీ ( విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనుదించినది %-% దాశరథి. హీరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో వచ్చిన 'వాగ్దానం' చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. 'నా కంటిపాపలో నిలిచిపోరా/ నీ వెంట లోకాలు గెలువనీరా' అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన 'ఇద్దరు మిత్రులు' సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి 'నవమి'. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు."జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే.." అన్నారాయన. అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు%ొ% అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు / నా తెలంగాణ కోటి రత్నాల వీణ." (అగ్నిధార ) ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి%ొ%. తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే". కోటి కోటి దీపాలనేనురా తెలగాణ నిగళాల తెగగొట్టి ఆకాశమంతను బాటలలో, కోటలలో నాటండి ప్రజల్లారా.. వేటాడండి తమస్సును.."అనాదిగా సాగుతోంది - అనంత సంగ్రామం / అనాథునికీ ఆ గర్భశ్రీనాథునికీ మధ్య". ఉన్నదాన్ని వున్న వాళ్లందరిలో పంచి / ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి"...గతాన్ని కాదనలేను - వర్తమానం వద్దనబోను / భవిష్యత్తు వదులుకోబోను %-% కాలం నాకంఠమాల"... హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను / శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సాల్వేషన్"... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.

# ఉసిరి చెట్టు పూజలు

**మండల కేంద్రం లోని పెద్దమారూ ర్ గ్రామంలో**

**అగ్నిదార న్యూస్. చిన్నంబావి మండలం** కార్తిక మాసం రెండవ వారం సందర్భంగా శ్రీ శ్రీ రామాలయం టెంపుల్ ఆలయంలో ఉసిరి చెట్టు కింద వనభోజనం రథం పెద్ద మారూర్ గ్రామ ప్రజల సహకారంతో వనభోజనం కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది వివిధ దాతల సహకారంతో దేవాలయ సంఘం ఆధ్వర్యంలో భక్తులుచే ఘనంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు ఉదయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ స్వామివారికి మారేడు దళాలతో అభిషేకం అర్చన ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉసిరి చెట్టు కింద వనభోజనాలు కార్తిక సోమవారం సందర్భంగా మారేడు దళలతో పూజించడం శివునికి అత్యున్నత ప్రీతి కరమని భావించి భక్తులు ఆరాధనతో పాల్గొన్నారు. ఆలయం ప్రాణంగం "హర హర మహాదేవ" వినాదాలతో మార్మోగింది మహిళలు దీపాలు వెలిగించి పత్రాలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో దేవలయ కమిటీ సభ్యులు బి రమణయ్య, శివ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, బి శ్రీనివాసులు, లొంక సత్యమ్మ, టి బాలస్వామి జగ్గారి భగవంతు రెడ్డి జనార్దన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరేందర్ గౌడ్ కోంటి శివ



వడ్ల బిచ్చన్న చట్టమోని ఆంజనేయులు శివ స్వామి జెడ్ బాల్ రెడ్డి శివ స్వామి అయ్యప్ప స్వాములు లక్ష్మి పల్లి గ్రామ స్వాములు ఎద్దుల మహేశ్వర్ రెడ్డి. భాస్కర్. సురేష్ బి సురేష్ చరణ్. గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**అగ్నిధార న్యూస్గండీడ్:** మండల కేంద్రానికి చెందిన కుమ్మరి గుండప్ప అంత్యక్రియలో పాల్గొన్న 1999-2000 పదవ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బ్యాచ్ స్నేహితుడు కుమ్మరి గుండప్ప రాత్రి పరమపదించారు.మరణ వార్త తెలుసుకున్న మిత్రులు పార్థివదేహానికి నివాళులు అర్పించి స్నేహితులు అందరు కలిసి 39000 రూపాయలు మిత్రుని కుటుంబీకులకు ఖర్చుల నిమిత్తం చిన్న సహాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమలో గుముడాల చెన్నయ్య, బి. రాములు, ఆర్. జనార్ధన్ రెడ్డి, సి. శ్రీకాంత్, సాజిత్, మహేందర్, రవి, నర్సిములు, వెంకటయ్య, శంకర్, సురేందర్, బి. రాములు, గంగాధర్ రెడ్డి, శ్రీనివాసులు ,కేశవులు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిల విడుదలకు నిరాహార దీక్ష




**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:** నంచర్ల ఎక్స్ రోడ్ పల్లవి కళాశాల గేటు వద్ద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డి.రాఘవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైపోతుందని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## దున్నపోతు అక్రమ కరెంటు సప్లై తగిలి మృతి

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**మొకర్లబాద్ గ్రామంలో మైసమ్మ కోసం గ్రామస్తులు ఊరికి విడిచిన దున్నపోతు సుమారు 20 రోజులుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగుతూ వచ్చింది. ఇటీవల అది కొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గంటల కృష్ణయ్య (తండ్రి బుచ్చయ్య) పొలం వైపు వెళ్లగా, అడవి పందుల నియంత్రణ కోసం ఆయన ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ సప్లై తగిలి దున్నపోతు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై మొకర్లాబాద్ గ్రామానికి చెందిన కవలెంటి రామయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, అజాగ్రత్తగా అక్రమ విద్యుత్ సప్లై ఏర్పాటు చేసి పశువుకు నష్టం కలిగించిన బాధ్యుడు గంటల కృష్ణయ్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.


## పిడుగు పాటుకు మూడు ఆవులు మృతి



**అగ్ని ధార న్యూస్ ( కల్వకుర్తి)** వెల్దండ మండల పరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తిమ్మినోని పల్లి గ్రామానికి చెందిన గుమ్మ కొండ లింగమయ్య కు చెందిన మూడు పాడి ఆవులు పిడుగు పాటు గురై మృతి సంఘటన చోటుచేసుకుంది. సోమవారం రాత్రి తన పశువుల షెడ్డులో ఆవులను కట్టేసి ఇంటికి వచ్చిన రైతు లింగమయ్య మంగళవారం తెల్లవారు జామున ఆవులకు పాలు పితకడానికి వెళ్లి చూడగా మూడు ఆవులు విగతజీవిగా పడి ఉండటం చూసి రైతు కన్నీరు మునీరుతో బోరున విలపించాడు. సుమారు రూ. 2 లక్షల పైగా విలువ చేసే మూడు పాడి ఆవులు మృతి చెందడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని లింగమయ్య కోరాడు.


## మాజీ మంత్రి హరీష్ రావు ని పరామర్శించిన మాజీ జెడ్పీటిసి

**సంతోష్ రావు చిత్రపటానికి నివాళులు**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట శాసన సభ్యులు బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హరీష్ రావు తండ్రి ఇటీవల మరణించారు వారి నివాసానికి వెళ్లి హరీష్ రావును పరామర్శించి వారి తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించిన కల్వకుర్తి మాజీ మార్కెట్ చైర్మన్ మరియు వెల్దండ మాజీ జెడ్పీటిసి దంపతులు డాక్టర్ విజితా రెడ్డి ఆనంద్ రెడ్డి..

## సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డిని సన్మానించిన గుజ్జుల మహేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** హైదరాబాదులోనీ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మరియు ఇండి యా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ అనంతరం బీసీ రిజర్వేషన్ గురించి చర్చించడం జరిగింది.

## పత్తాలేని పశు వైద్య అధికారి



**అగ్నిధార న్యూస్ కమన్పూర్** కమాన్పూర్ మండల కేంద్రంలో పశు వైద్య అధికారి గత కొన్ని రోజులుగా రాకపోవడంతో ప్రజలు పశువుల సమస్యలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. మండల కేంద్రానికి చెందిన సుద్దాల మూర్తి అనే రైతు తన ఆవు అనారోగ్యం ఉండగా మూడు రోజులుగా ఆ రైతు ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నప్పటికీ వైద్యాధికారి రావడంలేదని పేర్కొన్నా డు. అలాగే అక్కడున్న కాంపౌండర్ ను డాక్టర్ ఎక్కడ అని అడిగితే తెలియదని సమాధానం చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్యాధికారిని ప్రతిరోజు వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కొత్త వసతి గృహాలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు"

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణానికి తెలంగాణ సర్కార్ రూ.13.15 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు హయ్యర్ ఎడ్యుకేషన్ శాఖ.169 జారీ చేసింది. విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో వనపర్తి విద్యార్థులకు ఆధునిక వసతి సదుపాయాలు అందనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

**హెల్మెట్ లేకుండా బైకులు నడపరాదు**

**పి.ఎస్సై కృష్ణాజి**



**అగ్నిధార న్యూస్ గండీడ్:** మండల కేంద్రంలో విశ్వభారతి కాలేజీలో మంగళవారం నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పి ఎస్ ఐ కృష్ణాజి కాలేజీ విద్యార్థులకు చెడు వ్యసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎవరు కూడా తాగుడుకు బానిస కావద్దని తాగుడుకు బానిస అయితే కుటుంబ కలహాలు ఏర్పడతాయని ఆయన తెలిపారు. కుటుంబ కలహాలు ఏర్పడటం వల్ల ఎన్నో అనర్థాలకు దారితీస్తాయని అందుకే విద్యార్థులు ఎవరు కూడా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు.హెల్మెట్ లేకుండా విద్యార్థులు బైకులు నడపరాదు మైనర్ విద్యార్థులు బైకులు నడిపినట్లు అయితే వారిపై కేసు నమోదు అవుతుందని అన్నారు. విద్యార్థులు ముగ్గురు ముగ్గురు ఒకే బైక్ పై వెళ్లినట్లయితే త్రిబుల్ రైడింగ్ కేస్ చేస్తామని అన్నారు.సైబర్ నేరాలపై విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మీకు తెలవకుండా కొత్త నెంబర్ నుంచి ఫోన్ కాల్స్ వస్తే ఓటిపి చెప్పరాదని మీకు సైబర్ క్రైమ్ అని తెలిస్తే 1930 వరకు ఫోన్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ అశ్వ,పీసీ వీరేందర్, కాలేజీ ప్రిన్సిపాల్ భీమ్‌రెడ్డి,రాములు, మూస నర్సింలు చంద్రకాంత్, మాధవ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, స్వాతి, కల్పన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు


# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన లక్ష్యం

**ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గతంలో ఉన్నతి శిక్ష ఫౌండేషన్ సభ్యులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి గతంలో పరిశీలించి రెండు పాఠశాలలో విద్యార్థిని ,విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పినారు అందులో భాగంగా హైస్కూల్లో ఆరు రూములకు పెయింటింగ్ చేయించారు, వాటర్ ఫిల్టర్ రిపేర్, స్పోర్ట్స్ మెటీరియల్ అందించినారు మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5 బోర్డులు, టేబుల్స్, చైర్స్, రాక్, స్పోర్ట్స్ మెటీరియల్, ఈరోజు ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి అందించినారు ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిలకు మౌలిక వసతులు కల్పన లక్ష్యం గా మా ఫౌండేషన్ పని చేస్తుంది, మరియు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు మంచిగా చదువుకొని చదువుకున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు సేవలు చేసే వారికి మంచి పేరు తీసుకురావాలని కోరడం జరిగింది, మీరు కూడా బాగా చదివి భవిష్యత్తు లో కొంత సహాయం చేయాలని కోరారు. అనంతరం ఇరు పాఠశాలల ఉపాధ్యాయ బృందం, నాయకులు ఉన్నతి ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి ని, మరియు ఫౌండేషన్ సెక్రెటరీ బండి రఘుపతి ని శాలువా, పూలమాలతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నదా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కేశవులు, ఉన్నతి ఫౌండేషన్ కార్యదర్శి బండి రఘుపతి, ఫౌండేషన్ సభ్యులు శ్రీరామ్, రమేష్, నితిన్, గ్రామస్తులు, నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ అంజయ్య గౌడ్ మాజీ ఎంపీటీసీ లు జి శ్రీనివాసమూర్తి, అంబాజీ మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, నాయకులు పి అశోక్ బాబు, రాజు, విష్ణు, ఉపాధ్యాయులు శేఖర్, పరమేశ్, ఆదర్శ రావు, శ్రీదేవి, పూర్ణిమ ఆసియా, నాగాజ్యోతి, బాలికల పాఠశాల ఉపాధ్యాయ బృందం శోభ, ఖాజాబీ, శ్రీదేవీ, ప్రసూన, బాలకృష్ణ, వెంకటరమన, పుణ్యవతి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి పట్టణంలో దొంగల బీభత్సం

**మూడున్నర తులాల బంగారు అపహరణ**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోని లక్ష్మణ్ గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. వంగూరు మండలం పోల్కంపల్లి కి చెందిన లక్ష్మణ్ గౌడ్, కల్వకుర్తిలో నూతనంగా ఇంటిని కొనుగోలు చేశాడు. సోమవారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి బంధువులందరూ కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి కాంపౌండ్ గోడ పైనుండి దూకి లోపలికి వచ్చాడు.మెయిన్ డోర్ పక్కన ఉన్న కిటికీ తెరిచి ఉండడంతో అందులో నుండి చేయి పెట్టి డోర్ గడియ అని తీశాడు. మెయిన్ హాల్లో గృహప్రవేశం సందర్భంగా ఏర్పాటుచేసిన దేవుని బొమ్మల మెడలో ఉన్న బంగారు గొలుసును తీసుకొని బెడ్ రూమ్ లోకి వెళ్లాడు. అక్కడ నిద్రిస్తున్న మహిళ మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్ళాడు. వెంటనే తేరుకుని ఆమె కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. దొంగ కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

## ఎమ్మెల్యే సహకారంతో తండా ప్రజల త్రాగునీటి సమస్య పరిష్కారం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం లింగారావుపల్లి గ్రామా పంచాయతీకి చెందిన లింగారావుపల్లి తాండ లో గత కొన్ని రోజులుగా త్రాగునీటి సమస్య ఉండడంతో విషయం గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసరెడ్డి వెంటనే స్పందించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆ ప్రాంతంలో బోర్ పాయింట్ వేయించడం జరిగింది.తాండ వాసులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాసు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య, ఉప సర్పంచ్ పర్దేపురం మణికంఠ, యాదయ్య, మాజీ వార్డు సభ్యులు జేలందర్ రెడ్డి, ఇందిరమ్మ సబ్యులు పార్దేపుర జంగయ్య, ఇమ్మిడి సాయిలు, నిడుదవెల్లి చంద్రశేఖర్, బోచుపల్లి జంగయ్య, బొచ్చుపల్లి శేఖర్, జింకుంట్ల ప్రవీణ్ కుమార్ గౌడ్, మల్లెమొగ్గల అంజయ్య, రబ్బానీ, లాల్యా, కంద్య, జమిలి దేవి, రాములు, రుక్మిణీ, తదితరులు పాల్గొనడం జరిగింది.

## చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

**ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలంలోని తుర్కలపల్లి గ్రామం వీరపాకుల జంగమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని తుర్కపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలు కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు శేఖర్ గౌడ్,వీరపాకుల నాగరాజు, వీరపాకుల వెంకటయ్య, ముత్యామయ్య, మహేష్ బాబు, పల్లె వెంకటయ్య, కృష్ణ, శ్రీమాన్, పరుశరామ్,బాలస్వామి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి సొంత డబ్బుతో నిత్యావసరాల సరుకులు చేయూత

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం లోని వెంకటాపూర్ గ్రామంలో గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కే ఎల్ ఐ కాలువ నిండి పై నుండి నీరు ప్రవహించి అంజమ్మ ఇంట్లో కి భారీగా నీరు చేరడంతో ఇంట్లో ఉన్న బియ్యం ఇతర సామాగ్రి తడిసి పోవడంతో విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి తన సొంత డబ్బులతో 25 కిలోల బియ్యం బస్తా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంబూ ఇస్తారి, సంతోష్, ఐలెన్ , భీమయ్య, శ్రీను, ప్రవీణ్, పాండు, కిరణ్, మల్లేష్, వెంకటేష్ మరియు పాల్గొన్నారు.


## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో చెక్కు అందజేత

**వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీ తునికి బండ తండ కి చెందిన మూడవత్ కేశ్య తండ్రి లస్కర్ అనారోగ్యంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స తీసుకోవడం జరిగింది ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరు అయినా 21,000 వేల రూపాయలా చెక్కును మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ బాధితునికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి కృష్ణ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గుద్దటి లక్ష్మారెడ్డి, నెంట శ్రీను, శివదనుసు మాద్గుల వెంకటయ్య, మోత్య నాయక్, శివరాం నాయక్,సుధాకర్, తిరుపతి నాయక్,అనిల్, రాజేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, ప్రశాంత్,సంతోష్ నాయక్, ఉదేయ్ నాయక్, వినోద్, జంగన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు

## నూతన కమిటీ ఎన్నిక




**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ నవంబర్:04** కొత్తగూడెం ఏరియా(వి కే సీ ఎమ్)మైన్ నందు కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నూతన ఫిట్ కమిటీని ఈ రోజున డ్రైవర్ల విభాగం సెంట్రల్ కమిటీ నెంబర్ భాష బోయిన రవికుమార్ ఆధ్వర్యంలో గని మేనేజర్ మురళిగారికి నూతన ఫిట్ సెక్రెటరీ ఇల్లటం శంకర్ ట్రెజరర్ విజయ్ అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ కట్ట నరేష్ జనరల్ షిఫ్ట్ ఇంచార్జ్ ఎండి అజారుద్దీన్ ని మేనేజర్ పరిచయం చేయడం జరిగినదిఈ యొక్క కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జనరల్ సెక్రెటరీ మేడిపల్లి కరుణాకర్ గారు పాల్గొని ఈ యొక్క కమిటీనిఎన్నికల ద్వారా ఎన్నుకొని రెండు సంవత్సరాల కాలపరిమితి లోబడి పని చేస్తారని కూడా మేనేజర్ తెలియజేయడం జరిగింది మేనేజర్ మురళి మాట్లాడుతూ మీయొక్క సమస్యలను మా దృష్టికి తీసుకు వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కరిస్తామని అదేవిధంగా కంపెనీ కూడా మీ వంతు కృషి చేయాలని చెప్పడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ఆఫ్ లోడింగ్ ఇంచార్జ్ రామచందర్ అధిక సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు

# అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు**




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఈ సంవత్సరం వర్షాలు అధికంగా పడటం వల్ల పత్తి పంట కు తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు అప్పు చేసి అనేక కష్టనష్టాలకోర్చి పత్తి పంట సాగు చేస్తే పంట చేతికి రాకముందే అధిక వర్షాల వల్ల ఎర్రగుమ్మడి తెగులు పడి జాలువారి ఎకరాలకు ఎకరాలు చేతికి రాకుండా పోయిందని ఎకరాకు12 ,15 క్వింటాళ్లు దిగుబడి రావాల్సిన పత్తి కేవలం రెండు మూడు క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని అందుకని ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకొని ఎకరాకు 50,000 నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు తెలిపారు.మంగళవారం కల్వకుర్తి ఆర్డిఓ జనార్దన్ రెడ్డి గారికి సిపిఎం పార్టీ తరఫున రైతులను ఆదుకోవాలని వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాలు అదేవిధంగా మెంథ తుఫాను వల్ల వరి పంట కూడా పూర్తిగా కోతలకు వచ్చిన సమయంలో తుఫాన్ రావడం వల్ల అనేక చోట్ల వరదల్లో కొట్టుకుపోయిందని చేను నేలకొరగడం జరిగిందని రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో అగ్రికల్చర్ అధికారులతో సమగ్రంగా సర్వే చేయించి వరి పంట నష్టపోయిన రైతులకు కూడా ఎకరాకు 30,000 చెల్లించే విధంగా చూడాలని తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక బాల్రెడ్డి మాట్లాడుతూ పత్తి రైతులకు కంపాస్ కిసాన్ ఆపు ను రద్దుచేసి ఏ షరతులు లేకుండా రైతుల వద్ద సిసిఐ ద్వారా పత్తిని నేరుగా కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఏపీ. మల్లయ్య, పరశురాములు, రైతు సంఘం నాయకుడు కిషోర్, మరియు టీ. చెన్నయ్య ,పర్వతాలు, బీరయ్య,యాదయ్య, పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన లక్ష్యం






**ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గతంలో ఉన్నతి శిక్ష ఫౌండేషన్ సభ్యులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి గతంలో పరిశీలించి రెండు పాఠశాలలో విద్యార్థిని ,విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పినారు అందులో భాగంగా హైస్కూల్లో ఆరు రూములకు పెయింటింగ్ చేయించారు, వాటర్ ఫిల్టర్ రిపేర్, స్పోర్ట్స్ మెటీరియల్ అందించినారు మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5 బోర్డులు, టేబుల్స్, చైర్స్, రాక్, స్పోర్ట్స్ మెటీరియల్, ఈరోజు ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి అందించినారు ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిలకు మౌలిక వసతులు కల్పన లక్ష్యం గా మా ఫౌండేషన్ పని చేస్తుంది, మరియు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు మంచిగా చదువుకొని చదువుకున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు సేవలు చేసే వారికి మంచి పేరు తీసుకురావాలని కోరడం జరిగింది, మీరు కూడా బాగా చదివి భవిష్యత్తు లో కొంత సహాయం చేయాలని కోరారు. అనంతరం ఇరు పాఠశాలల ఉపాధ్యాయ బృందం, నాయకులు ఉన్నతి ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి ని, మరియు ఫౌండేషన్ సెక్రెటరీ బండి రఘుపతి ని శాలువా, పూలమాలతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నదా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కేశవులు, ఉన్నతి ఫౌండేషన్ కార్యదర్శి బండి రఘుపతి, ఫౌండేషన్ సభ్యులు శ్రీరామ్, రమేష్, నితిన్, గ్రామస్తులు, నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ అంజయ్య గౌడ్ మాజీ ఎంపీటీసీ లు జి శ్రీనివాసమూర్తి, అంబాజీ మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, నాయకులు పి అశోక్ బాబు రాజు విష్ణు, ఉపాధ్యాయులు శేఖర్ పరమేశ్, ఆదర్శ రావు శ్రీదేవి, పూర్ణిమ ఆసియా నాగాజ్యోతి, బాలికల పాఠశాల ఉపాధ్యాయ బృందం శోభ ఖాజాబీ, శ్రీదేవీ, ప్రసూన, బాలకృష్ణ, వెంకటరమన పుణ్యవతి వసుంధర తదితరులు పాల్గొన్నారు.

# మూతపడిన సింగరేణి సెక్టర్ -2 కమ్యూనిటీ హాల్

**మినీ బ్యాంకెట్ హాల్ గా నిర్మించాలి**

**- ఎన్నోఏండ్లగా ఖాళీగా ఉన్న స్థలంలో కార్మిక కుటుంబాల కోసం పార్క్ నిర్మించాలి**

**- డివిజన్ లో రోడ్లు చెడిపోయిన చోట నూతన రోడ్లను నిర్మించాలి**

**- మద్దెల దినేష్**

**- ప్రభావిత ప్రాంతమైన 33వ డివిజన్ నీ సందర్శించిన సింగరేణి అధికారులు**



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ నవంబర్: 04** గోదావరిఖని లోని ఆర్జీ -1 పరిధిలో ఓసిపీ -5 ప్రభావిత ప్రాంతం అయిన 33వ డివిజన్ సందర్శించాలని జి. ఎం లలిత్ కుమార్ ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ కోరగా వారి ఆదేశాల మేరకు మంగళవారం రోజున ఎస్ ఓ టు జి ఎం చంద్రశేఖర్, సివిల్ డిజిఎం వరప్రసాద్, ఎస్ఎస్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి మరియు వారి క్రింది సిబ్బంది సూపర్వైజర్లు, ఇంజనీర్లు కలసి 33వ డివిజన్ సందర్శించారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ ఓసిపి-5 ప్రభావిత ప్రాంతమైన 33వ డివిజన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని కనీసం కార్మికుల కుటుంబాల శుభకార్యాలు చేసుకుందామన్నా సెక్టర్ -2 కమ్యూనిటీ హాల్ ఉండి లేనట్టు అవుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. కనీస సౌకర్యాలు లేక అనేక సంవత్సరాల నుండి మూత పడిందని దీనివల్ల కార్మిక కుటుంబాలు అనేక రకాలుగా ఆర్థికంగా నష్టపోతున్నారని కావున ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి ఇట్టి కమ్యూనిటి హాల్ ని మినీ బ్యాంకట్ హాల్ గా మార్చాలని దాని ద్వారా సింగరేణికి ఆదాయం ఆదాయయంతో పాటు కార్మికుల కుటుంబాల శుభాకార్యలకు సౌకర్యంగా ఉంటుందని సుమారు పది డివిజన్ల ప్రజలకు ఉపాయోగ పడుతుందని అధికారులకు సూచించడం జరిగిందని పేర్కొన్నారు.అదే విధంగా కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఏండ్ల నుండి ఖాళీ స్థలం ఉన్న ప్రదేశం రోజు రోజుకు అడవిల తయారై అయితుందని దానిలో పాములు ఇతర జీవులు చుట్టూ ప్రక్కల ఇండ్ల లోకి ప్రవేశించి నాన రకాలు గాఇబ్బంది పడుతు భయబ్రాంతులకు గురైతున్నారని, కావున సింగరేణి అధికారులు యుద్ధ ప్రత్తిపాధికన ఖాళీ స్థలంలో కార్మికుల కుటుంబాల సౌకర్యర్థం కొరకు వారి కుటుంబ సభ్యుల కోసం నూతంగా పార్క్ ఏర్పాటు చేయాలని ఓపెన్ జీమ్ మంజూరు చేయాలని ప్రజల పక్షాన అధికారులను కోరడం జరిగింది.అదే విధంగా కార్మికుల ఇండ్లలో ముందు పూర్తిగా రోడ్లు మొత్తం చెడిపోయాయాయని కావున నూతన రోడ్లు మంజూరు చేయాలని అధికారులను కోరడం జరిగిందని, కావున అధికారులు సానుకూలంగా స్పందించి జిఎం తో చర్చించి త్వరలో ప్రజలకు అనుకూలంగా పనులు చేస్తామని హామీ ఇచ్చారు.ఇంకా ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఎర్రల రాజయ్య, శ్రీనివాస్, ఉదయ్, స్థానిక డివిజన్ పెద్దలు మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## "వికసిత్ భారత్ రోజగార్ యోజన ఉద్యోగులు, యాజమాన్యాలకు లాభదాయకం" : పీఎఫ్ కమిషనర్ మధుసూదనాచారి




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజగార్ యోజన పథకంపై అవగాహన కల్పించేందుకు ప్రాంతీయ భవినిధి కార్యాలయం, రంగారెడ్డి–హైదరాబాద్ ఆధ్వర్యంలో వనపర్తి మునిసిపల్ కార్యాలయంలో సెమినార్ నిర్వహించారు. ఇందులో ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యాలకు పథకం ప్రయోజనాలు, రిజిస్ట్రేషన్ విధానం, కొత్త చలాన్ జెనరేషన్ ప్రక్రియ, ఎంప్లాయిమెంట్ ఎన్రోల్మెంట్ కాంపెయిన్ వివరించారు. కార్యక్రమంలో రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 బి.మధుసూదనాచారి, అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ కేవీన్ రామకృష్ణ, ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్లు ప్రసాద్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉద్యోగులు, యాజమాన్యాలు రెండింటికీ ఈ పథకాలు లాభదాయకమని, ఉద్యోగుల కుటుంబాలకు కూడా సౌకర్యవంతంగా ఉంటాయని మధుసూదనాచారి తెలిపారు.

## పాత నిధులకే కొత్త జి.ఓ హంగులు అశోక్ ఫైర్



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** పాలిటెక్నిక్ నిధులపై ప్రజలను మభ్యపెడుతున్నారని వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ ఎం.ఎల్.ఏ మేఘారెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ, వసతి గృహాల పునర్నిర్మాణం కోసం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రత్యేక కృషితో జి.ఓ. 335, తేదీ 11.08.2023 ద్వారా 22 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఇప్పటికే మంజూరైన నిధులను కొత్త జి.ఓ. పేరుతో తమ అభివృద్ధిగా ప్రచారం చేయడం విడ్డూరమని ఆయన ఎద్దేవా చేశారు. "జి.ఓ. నంబర్ మారితే అభివృద్ధి మీ ఖాతాలో పడుతుందా ఎం.ఎల్.ఏ గారు?" అని అశోక్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిధులను తమ విజయంగా చెప్పుకోవడం సిగ్గుచేటని, కొత్త అభివృద్ధి పనులు తెచ్చి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన హితవు పలికారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

**ఉపాధి అవకాశాలను యువత వినియోగించుకోవాలి**

**జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్.**



**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి , నవంబర్ -04** ప్రైవేట్ రంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువతీ, యువకులు వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మెడ్ ప్లస్ కంపెనీ నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. వివిధ ప్రాంతాల అభ్యర్థులు ధృవ పత్రాలతో పాల్గొన్నారని, కంపెనీ ప్రతినిధులు ఎంపిక విధానం ఉద్యోగం గురించి వివరించి ఇంటర్వ్యూలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కాకుండా ప్రైవేట్ రంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మెడ్ ప్లస్ కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కార్తిక పౌర్ణమి

**భక్తులతో కిటకిటలాడునున్న శివాలయాలు**



**అగ్ని ధార న్యూస్ గోదావరిఖని టౌన్: 04** ప్రస్తుతం కార్తీక మాసం కొనసాగుతుంది. దీంతో ఈ మాసంలో ప్రతి రోజు అధిక సంఖ్యలో భక్తులు వేముల వాడ, కాలేశ్వరం, ధర్మపురి, వంటి దేవాలయాలకు భక్తులు తరలివెళ్తున్నారు. ఇక, శివాలయాల్లో అయితే దీపాల కాంతులతో, శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో లక్ష్మీదేవిని పూజిస్తున్నారు. సహజంగా ప్రతి శుక్రవారం లక్ష్మీదేవిని అర్చిస్తారు. కానీ.. కార్తీక మాసంలో ప్రతి రోజు లక్ష్మీదేవిని ఆరాధి స్తుంటారు. ఈ తరుణంలో మహిళలందరూ ఎదురు చూస్తున్న కార్తీక పౌర్ణమి ఈ ఏడాది నవంబర్ 05వ తేదీన వచ్చింది. అంటే.. రేపే కార్తీక పౌర్ణమి. ఈ రోజు చాలా విశిష్టమైన రోజు కాబట్టి కొన్ని ఆచారాలు పాటించాలని పండితులు చెబుతున్నారు. కాబట్టి కార్తీక పౌర్ణమి రోజున సూర్యోదయానికి ముందే నిద్రలేచి తలస్నానం చేయాలి. ఈ తరుణంలో దేవాలయంలో కానీ, రావి లేదా తులసి చెట్టు వద్ద గానీ, నదీతీరంలో 365 వత్తులతో దీపారాధన చేస్తే మంచిదని పురణాలు చెబుతున్నాయి. అంతేకాదు.. పగలంతా ఉపవాసం ఉండి.. సూర్యా స్తమయంలో దీపారాధన చేసి.. పరమేశ్వరుడిని.. విష్ణుమూర్తిని పూజించాలి. ఈ రోజున పవిత్ర నదుల్లో స్నానం చేస్తారు. ఈ రోజున చేసే పూజలు, దీపారాధన గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. కార్తీక పౌర్ణమి తో పాటు గురు నానక్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రేపు అధికారికంగా సెలవు ప్రకటించింది.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

**– సిపిఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి**



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ నవంబర్ :04** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ కే కనకరాజు అధ్యక్షతన స్థానిక భాస్కరరావు భవన్లో మంగళవారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకరన్న హాజరై మాట్లాడుతూ " పేద ప్రజల కోసం స్వాతంత్ర సాధన కోసం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఈ సంవత్సరం డిసెంబర్ 26న శత వసంతాలు నిండుతున్న సందర్భంగా ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నామని వారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర పార్టీ శతాబ్ద ఉత్సవాల జీపు జాత ఆదిలాబాద్ జోడేఘాట్ నుండి ప్రారంభమై రాష్ట్రమంతా నిర్వహిస్తామని అందులో భాగంగా నవంబర్ 16 తేదీన గోదావరిఖని, పెద్దపల్లి మరియు సుల్తానాబాద్ ప్రాంతాలకు వస్తుంది, అధిక సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పార్టీ ప్రజాసంఘాల నాయకులు పార్టీ సానుభూతిపరులు ప్రజలు కార్మికులు హాజరై ఈ జాతాను విజయవంతం చేయాలని, ఉత్సవాల సందర్భంగా ఒక వాతావరణాన్ని తయారు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో నిధులను అదానీ అంబానీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల జేబు సంస్థలుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వారన్నారు. బీహార్ ఎన్నికలు దేశ రాజకీయ ఒక చిత్రాన్ని మారుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోష్కమోహన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్ , తాళ్లపల్లి మల్లయ్య, మడ్డి ఎల్లయ్య, మార్కపురి సూర్య, తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వై వి రావు, మాటేటి శంకర్, రామచందర్ ,జిగురు రవీందర్ ఆరేపల్లి మానస్ కుమార్, బాలసాని లెనిన్, రేణికుంట్ల ప్రీతం, కల్లెపల్లి నవీన్ చంద్రశేఖర్ రంగు శ్రీనివాస్, తొడుపునూరి రమేష్ కుమార్ పాల్గొన్నారు

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**డీ ఎం అండ్ హెచ్ ఓ వినతిపత్రం**

**ఎన్ హెచ్ ఎం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఎల్.సురేష్ నాయక్.**

**2 నెలల పెండింగ్ వేతనాలు, ఏడు నెలల పి ఆర్ సీ ఏరియర్స్ తక్షణమే చెల్లించాలనీ డిమాండ్.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న 2 నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం డీ ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్.వాణి శ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం)పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఎల్.సురేష్ నాయక్ మాట్లాడుతూ....ప్రతీ నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్హెచ్ఎం ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని,మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల సెలవులు మంజూరు చేయాలని,ఎన్.టి.ఈ.పి.లో పనిచేస్తున్న ఉద్యోగులకు పెట్రోల్ అలివేన్సులు టి.ఏ, డి.ఏ 3 సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్నాయని వెంటనే ఇప్పించాలని, ఏ జిల్లాలో పని చేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు డిప్యూటేషన్లు మరియు ట్రాన్స్ఫర్లు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో పనిచేస్తున్న డి పి పీ ఎం ప్రభాకర్, ఎన్. టీ ఈ. పీ. గోపి, తిరుపతి, రవీందర్, శ్రీనివాస్ శ్రావణి సురేందర్, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు అంజయ్య, సురేష్, పావని, మమత, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

**కల్లెపల్లి అశోక్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు నిధులు ఉన్న పనులు పూర్తి చేయని ప్రభుత్వం అని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని రాంపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కల్లెపల్లి అశోక్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ప్రదర్శించి మాట్లాడారు... తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్న కావస్తున్న ఇప్పటివరకు గత ప్రభుత్వ నిర్మించిన ఇండ్లను కూడా పూర్తిస్థాయిలో పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వలేదు. ఒక లబ్ధిదారుడు డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో నివాసం ఉండాలంటే సొంతంగా లక్ష నుండి రెండు లక్షల 50 వేలు రెండు లక్షల 50 వేల వరకు డబ్బులు చెల్లించి ఇంటి పనులు చేపించుకోవాల్సి వస్తుంది అన్నారు. ఇండ్లను కేటాయించారు కానీ. దాంట్లో ఎటువంటి పనులు ఉన్న సొంత డబ్బులతో చేయించుకోవాలని అధికారులు నాయకులు లబ్ధిదారులకు చెప్పిన పరిస్థితి ఉంది అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లబ్ధిదారులు పూర్తిగా ఇంటి లోపల ఉండే విధంగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందివ్వాలని అట్లాగే రోడ్డు సౌకర్యం నీటి సౌకర్యం డ్రైనేజ్ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని డిమాండ్ చేశారు. స్లాబ్ కు పగుళ్లు వస్తున్నాయి, ఇళ్లల్లో సమస్యలు రాజ్యమేలుతున్న ఈనెల 30వ తేదీ వరకు ఇంటి లబ్ధిదారులు అందరు తమ ఇండ్లలో ఉండాలి ఇంటి పనులు పూర్తి చేసుకోవాలి లేకపోతే మీకు వచ్చిన ఇంటిని రద్దు చేస్తామని అధికారులు హుకుం జారీ చేసిన పరిస్థితి ఉంది అన్నారు. ప్రభుత్వ పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ప్రభుత్వం మిగిలిపోయిన అన్ని పనులను చేయించాలని సిపిఎం పార్టీగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము అన్నారు. లేని పక్షంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులను పోగుచేసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపెల్లి రవీందర్, కుమ్మరి నవీన్, అది కృష్ణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు..

# మూడు రోజులు పత్తి కొనుగోలు బంద్



**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**పత్తి కొనుగోలు పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి నవంబర్-04:-** రాబోయే 3 రోజుల పాటు జిల్లాలోని మార్కెట్ యార్డులు, సీసీ కేంద్రాలకు పత్తి తీసుకొని రావద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర పత్తి జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ వారు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిన్నింగ్ మిల్స్, సిసిఐ, ప్రైవేటు కొనుగోలు నిలిపి వేస్తున్నామని అసోసియేషన్ వారు తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రైతులు మార్కెట్ కు గాని లేదా జిన్నింగ్ మిల్ వద్దకు పత్తి తీసుకొని రావద్దని అన్నారు. సీసీఐ విధించిన నిబంధనలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 విధానం , పక్క జిల్లాల రైతులను అనుమతి అనుమతించడం, పత్తి రైతు ఎకరానికి 7 క్వింటాలు అమ్ముకునే వీలు కల్పించడం విషయంలో సీసీఐ వారు కఠినంగా ఉన్నందున వెంటనే ఈ విషయంలో వెసులుబాటు కల్పించేంత వరకు పత్తి కొనుగోలు నిలిపేస్తున్నామని జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ ప్రకటించడం జరిగిందని అన్నారు. ఈ అంశాలను రైతులు గమనించి రాబోయే మూడు రోజుల వరకు పత్తిని మార్కెట్ యార్డ్ తీసుకు రాకూడదని, తదుపరి కొనుగోలు తేదీలను మరల ప్రకటించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి కాటన్ మార్కెట్ కమిటీ కార్యదర్శులు, పోలీస్ శాఖ రవాణా శాఖ ఫైర్ శాఖ అగ్నిమాపక శాఖ సీసీఐ అధికారులు జిన్నింగ్ మిల్లు ఓనర్లు పాల్గొన్నారు.

## సైన్స్ ఎగ్జిబిషన్ స్టెమ్ ఫర్ ఆత్మనిర్భర్ భారత్ మూడో వారంలో నిర్వహిస్తాం

**వనపర్తి డీఈఓ అబ్దుల్ ఘని**

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా :** వనపర్తి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ (2025–26) మరియు ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన (2024–25) సంయుక్తంగా నవంబర్ మూడవవారంలో నిర్వహించ నున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని గారు తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, తెలంగాణ మోడల్ స్కూల్స్, కేజీబీవీలు మరియు ప్రైవేటు పాఠశాలల 6 నుండి 12వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు. ఈ సంవత్సరం ప్రదర్శనకు ప్రధాన అంశంగా "స్టెమ్ ఫర్ వికసిత్ ఆత్మనిర్భర్ భారత్" అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధి భారతదేశం కొరకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితంరంగాల ప్రాధాన్యంను నిర్ణయించినట్లు వారు తెలిపారు. వరుసగా ఉప అంశాలు 1. సుస్థిర వ్యవసాయం

2. వ్యర్థ పదార్థాల నిర్వహణ, ప్రత్యామ్నాయ మొక్కలు
3. హరిత శక్తి4. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు
5. వినోదభరిత గణ నమూనాలు
6. ఆరోగ్యం,పరిశుభ్ర నిర్వహణ
7. నీటి సంరక్షణ, నిర్వహణ

పాఠశాలలవారీగా ఈ అంశాలపై నూతన ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులు సిద్ధం చేసి ప్రదర్శనలో పాల్గొనవచ్చని తెలిపారు. ఒక్కో పాఠశాల నుండి గరిష్ఠంగా ఆరు ప్రాజెక్టులు మాత్రమే ఎంపిక చేయాలని, ప్రతి పాఠశాల నుండి ఒక గైడ్ టీచర్ పాల్గొనవలసిందిగా సూచించారు. జిల్లా స్థాయి ఇన్స్పైర్ ప్రదర్శన (2024–25) కూడా ఈ సైన్స్ ఎగ్జిబిషన్తోపాటు నిర్వహించబడుతుందని, జిల్లాలో ఎంపికైన 124 ప్రాజెక్టులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రూ.10, 000/– చొప్పున నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని ఆయన తెలిపారు. ప్రదర్శన రెండవ రోజు విద్యార్థుల కోసం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం అనే అంశంపై వన్ డే సెమినార్ కూడా నిర్వహించబడనుందని డీఈఓ పేర్కొన్నారు. జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్కు సంబంధించిన పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎం. శ్రీనివాసులు (ఫోన్:9394574814)ని సంప్రదించవచ్చని డీఈఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## అనిల్ అంబానీ రూ.3 వేల కోట్ల ఆస్తులు అటాచ్



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన రూ.3వేల కోట్ల పైగా విలువైన ఆస్తులను ఎన్ ఫోర్స్ డైరెక్టరేట్ (ఇడి) అటాచ్ చేసింది. అటాచ్ చేసిన ఆస్తుల లిస్టులో ఆయన ఇంటితో పాటు పలు కమెర్షియల్ ప్రాపర్టీలు ఉన్నాయి. ఈ మేరకు ఇడి అధికారిక వర్గాలు సోమవారం పలు వివరాలను వెల్లడించాయి. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న ఆయన వాటిని వ్యాపారం కోసం ఉపయోగించకుండా మనీలాండరింగ్ ద్వారా వేరే ఖాతాలకు మళ్లించిన కేసులో ఇడి ఈ నిర్ణయం తీసుకుంది. అటాచ్ చేసిన అస్తుల్లో అనిల్ అంబానీకి చెందిన ముంబయిలోని ఆయన నివాసం, గ్రూప్ సంస్థల యాజమాన్యంలోని ఇతర నివాస, వాణిజ్య ఆస్తులు ఉన్నాయి. వీటికి సంబంధించి తాత్కాలిక ఉత్తర్వులను ఇడి జారీ చేసింది. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సిబిఐ తొలుత దర్యాప్తు చేపట్టింది. ఆ సంస్థ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. తాజాగా ఢిల్లీలోని మహారాజా రంజిత్సింగ్ మార్గ్లోని రిలయన్స్ సెంటర్కు చెందిన భూమి, నోయిడా, ఘజియాబాద్, ముంబయి, పూణే, థానే, హైదరాబాద్, చెన్నరు, ఆంధ్రపదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న అనేక ఆస్తులు అటాచ్ చేసిన జాబితాలో ఉన్నాయి. ఈ అటాచ్ చేయబడిన ఆస్తుల విలువ సుమారు 3,084 కోట్లుగా ఉంటుందని అంచనా.

# అలింకో ఉపకరణాలు సహాయక పరికరాలతో మేలు: ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల :** ఇల్లంతకుంటలో అలింకో ఉపకరణాలు సహాయక పరికరాల ఎంపిక శిబిరం పరిశీలన.ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన. అలింకో, ఏడీఐపీ, ఆర్వీవై ఆద్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల పంపిణీకి నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. అలింకో, ఏడీఐపీ, ఆర్వీవై ఆద్వర్యంలో ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఇంచార్జి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులకు ఎంపిక కోసం చేస్తున్న ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులు ఉపకరణాలు, సహాయక పరికరాల గుర్తింపు కోసము క్యాంపులు నిర్వహిస్తున్నారని వివరించారు. అర్హులందరూ పాల్గొనాలని సూచించారు. దివ్యాంగులు యూడీఐడీ కార్డ్ కోసం మొబైల్ లేదా మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు కేటాయించిన తేదీల్లో దవాఖానకు వెళ్లాలని, అక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులపై వివక్ష చూపవద్దని, అందరితో సమానంగా గౌరవించాలని పేర్కొన్నారు. అర్హులకు పరికరాలు అందిస్తున్న అలింకో బాధ్యులను అభినందించారు. శిబిరాల్లో అర్హత సాధించిన వారికి చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ళు, రోలేటర్స్, ఎం ఎస్ ఐ ఈ డీ కిట్-ఎం ఆర్ కిట్, స్మార్ట్ కేన్, అంధుల చేతి కర్ర, ఎల్ బో క్రచ్చేస్, అంధ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు సహాయక పరికరములు అందిస్తారని వెల్లడించారు. ట్రై పాడ్, టెట్రా ప్యాడ్,చేతి కర్రలు, వీల్ చైర్, వాకర్స్, వాష్ రూమ్ వీల్ చైర్, నడుం పట్టి, మెడ పట్టి, వినికిడి యంత్రాలు, ఫూట్ కేర్ యూనిట్, వాకింగ్ స్టిక్ విత్ సీట్, చంక కర్రలు, ఫోమ్ కుషన్, మోకాళ్ళ పట్టీలు, సహాయక పరికరములు ఇస్తారని తెలిపారు. దివ్యాంగులు, వృద్దులు కావాల్సిన పత్రాలు వెంట తీసుకుని రావాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ గురువారం చందుర్తి రైతు వేదికలో, 7 వ తేదీన శుక్రవారం వేములవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయముల సముదాయంలో, 10వ తేదీన సోమవారం ముస్తాబాద్ రైతు వేదికలో, 11 వ తేదీన మంగళవారం సిరిసిల్ల సి.నా.రె. కళామందిరంలో శిబిరాలు నిర్వహిస్తారని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. శిబిరంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఎంపీడీఓ శశికళ, తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర:ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందుతుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో నిర్వహిస్తున్న ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, కొనుగోళ్లు పరిశీలించారు. రైతులకు అన్ని వసతులు కల్పించాలని, తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేసి తరలించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలిఅర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఆర్థిక సాయాన్ని వినియోగించుకొని నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఇల్లంతకుంట లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో లబ్ధిదారులు తమ కలల ఇంటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. సందర్శనలో గృహ నిర్మాణ శాఖ పీడీ శంకర్, ఎంపీడీఓ శశికళ, తదితరులు ఉన్నారు.

# వైఎస్ఆర్ ఆశయానికి తూట్లు పొడిచేలా రేవంత్ పాలన




**జగిత్యాల :** స్వర్గీయ మాజీ ఉమ్మడి రాష్ట్ర సీఎం వై.ఎస్ ఆర్ ఆశయానికి తూట్లు పొడిచేలా, కాంగ్రెస్ పార్టీ ఆరాంభించిన పథకం ను నీరుగార్చేలా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నం చెయ్యడం విడ్డురంగా ఉందని జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత -సురేష్ విమర్శించారు. ఫీజు రియాంబర్స్మెంట్ బకాయిలు విడుదల చెయ్యాలని రాష్ట్రంలోని డిగ్రీ మరియు పీజీ కళాశాలల యాజమాన్యలు ఇచ్చిన నిరవధిక బంద్ కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు పట్టణంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించిన అనంతరం, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసన కు సంఘీభావంగా జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత- సురేష్ బీఆర్ఎస్ పార్టీ పక్షాన సంఘీభావం ప్రకటించారు. అనంతరం దావ వసంత మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థుల, యాజమాన్యం భవిష్యత్ ప్రశ్నర్థకంగా మారిం దన్నారు. స్కాలర్షిప్,ఫీజు రియాంబర్స్మెంట్ విడుదల కోసం రాష్టంలో కళాశాలలు నిరవధిక బంద్ పాటించడం, కళాశాల యాజమాన్యలు, అధ్యాపకులు రోడ్డు మీదికి రావడం దురదృష్టకరం అన్నారు.ఇప్పటికే ఇస్తామన్న రూ. 1200 కోట్లకు టోకెన్ ల నిధులు విడుదల చేసి, ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఇప్పటికే యాజమాన్యలు పలుమార్లు విజ్ఞప్తి చేసిన, రేండు సార్లు బంద్ ప్రకటించిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం నిరంకుశ ధోరణి తో విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విధానంతో ఉన్నత చదువులు చదువుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ నిధులు విడుదల చెయ్యలేని అసమర్ధ ప్రభుత్వం కళాశాలలపై విజిలెన్స్ దాడులు, తనిఖీ ల పేరుతో యాజమాన్యలను భయభ్రాతులకు గురి చెయ్యడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం అనాలోచిత విధానం వల్లనే రాష్టంలో విద్యార్థుల దుస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం కు విద్య వ్యవస్థ పై ముందుచూపు, స్పష్టమైన ప్రణాళిక, చిత్త శుద్ధి లేకపోవడనే ప్రధాన కారణం అన్నారు. సాక్ష్యత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతిలో విద్య వ్యవస్థ ఉండి, విద్యార్థుల భవిష్యత్ తో ఆటలు ఆడడం దుర్మార్గకరం అన్నారు. అణచివేతలతో, అధికారం తో భయపెట్టాలని చుస్తే, అగ్నికి ఆజ్యం పోసినట్టే అవుతుందని ప్రభుత్వం గ్రహించాలన్నారు. ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికైనా కళ్ళు తెరవాలన్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు రూ. 70-100 కోట్ల వరకు నిధులు పెండింగ్ లో ఉన్నాయని, రాష్ట్రం లో సుమారు 10 వేల కోట్ల వరకు ఫీజు రియాంబర్స్ మెంట్, స్కాలర్షిప్ లు చేరాయా న్నారు. జిల్లాల వారీగా, యూనిట్ ప్రాతిపదికన, ముందస్తు ప్రణాళిక తో నిధులు విడుదల చేసే ఆలోచన కూడా ప్రభుత్వం చెయ్యడం లేదని విమర్శించారు.ఇప్పటికే జగిత్యాల జిల్లాలో 10 కళాశాలలు ఆర్థిక ఇబ్బందులతో మూతబడి ఉన్నాయని,ప్రస్తుతం 11 కళాశాలలు ఆర్థిక ఇబ్బందితో కొట్టుమిట్టడుతూ కళాశాలలు నడిపిస్తున్నాయ న్నారు. ప్రభుత్వం విధానంతో అవి కూడా మూత పడే పరిస్థితి తీసుకురావద్దని ప్రభుత్వం కు విజ్ఞప్తి చేస్తున్నామ న్నారు. కనీసం ప్రభుత్వం ఇచ్చిన రూ. 1200 టోకెన్ ల నిధులు విడుదల చేసి అయినా కళాశాలకు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం చొరవ చూపి, కళాశాలలు తెరుచుకు నేందుకు కృషి చేయాలని, యాజమాన్యలకు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే విద్యార్థుల జీవితాలతో పాటు, యాజమాన్యం, అందులో పనిచేసే సిబ్బంది జీవితాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం కళ్ళు తెరవాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ పాలనలో ఏనాడూ ఇలాంటి దుస్థితి రాలేదని, అంతకు ముందున్న ప్రభుత్వ పథకాలను కొనసాగించడంతో పాటు, నూతన పథకాలకు శ్రీకారం చుట్టారని, కానీ రేవంత్ రెడ్డి తమ పార్టీ ప్రభుత్వం లో పెట్టిన పథకానే నిలిపివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం ప్రవీణ్, చింతల గంగాధర్, గంగిపెల్లి వేణు, పెండెం గంగాధర్,గాజుల శ్రీనివాస్, పట్నం అనురాధ, నీలి ప్రతాప్, ప్రణయ్ తో పాటు డిగ్రీ,పీజీ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబర్పేట్ కిడ్నాప్ కేసులో 10 మంది అరెస్ట్

**హైదరాబాద్ :** అంబర్పేట్ డీడీ కాలనీలో గత నెల 29వ తేదీన చోటుచేసుకున్న కిడ్నాప్ కేసును అంబర్పేట్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న 10 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు.మంత్రి శ్యామ్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేసి రూ.1.5 కోట్ల రూపాయలు డిమాండ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆరుగురు నిందితులు శ్యామ్ను అపహరించారని పోలీసులు గుర్తించారు. వారు రెంట్ కార్లలో ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది.ప్రధాన నిందితురాలు మాధవీలత అమెరికాలో మంత్రి శ్యామ్తో వివాహం చేసుకొని మూడు సంవత్సరాల వ్యవధిలోనే విడాకులు పొందింది. గత మూడు సంవత్సరాలుగా ఆమె భర్తకు దూరంగా ఉంది. బాధితుడు శ్యామ్ తన పేరును 'అలి'గా మార్చుకొని ఫాతిమా అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. శ్యామ్ తండ్రి నుంచి వచ్చిన రూ.20 కోట్ల విలువైన ఆస్తిని విక్రయించినట్లు సమాచారం.ఈ గ్యాంగ్ ప్రధాన సూత్రధారి సాయి అనే వ్యక్తి రామనగర్ ప్రాంతానికి చెందినవాడని పోలీసులు తెలిపారు. మరో నిందితురాలు జీ.ప్రీతి లేడీ బౌన్సర్గా పనిచేస్తుండగా, ఎల్.సరిత అనే మరో మహిళ బాధితుడు ఉన్న అపార్ట్మెంట్లోనే ఘటనకు రెండు రోజుల ముందు నివసించి, అతని కదలికలపై నిఘా పెట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితుడిని చెర్లపల్లి ప్రాంతానికి తీసుకెళ్లి రెండు ప్రదేశాల్లో తిప్పుతూ రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు విచారణలో తేలింది. బాధితుడు డబ్బులు సర్దుబాటు చేసుకోవడానికి తన స్నేహితుడికి ఫోన్ చేయగా, ఆ స్నేహితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. శ్యామ్ తెలివిగా తప్పించుకుని పోలీసులకు వివరాలు తెలియజేశాడు.కేసు నమోదు చేసిన పోలీసులు 10 మందిని అరెస్ట్ చేశారు. కేసులో మిగిలిన నలుగురిని త్వరలో పట్టుకుంటామని డీసీపీ బాలస్వామి తెలిపారు.

## ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వండి



**ఖమ్మం :** గడిచిన నాలుగేళ్లుగా ఉన్నత విద్యాసంస్థల్లో విద్యానభ్యసిస్తున్న విద్యార్థులకు పీజు రియంబర్స్ మెంట్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ప్రవేటు విద్యాసంస్థలు సమ్మెకు దిగాయి. తమకు రావాల్సిన పీజు రియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించేవరకు తమ సమ్మె కొనసాగుతుందని విద్యాసంస్థల అధినేతలు స్పష్టం చేస్తున్నారు..ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల్లో పనిచేసే సిబ్బంది, అధ్యాపకుల జీతాలు చెల్లించలేని పరిస్థితిలోకి వెళ్లామని,బకాయిలు ఇచ్చే వరకు తాము సమ్మె విరమించమని ఖమ్మం జిల్లా కళాశాల యజమానులు వాపోయారు.. ఎన్నో నష్టాలు అనుభవిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చడం కోసం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరిగింది . కానీ ప్రభుత్వం మాకు రావలసిన బకాయిల ను ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుందని . అనేక విద్యాలయాలు మూతపడుతున్నాయి అని కరోనా సమయంలో కూడా నాణ్యమైన విద్య అందించాం అని . ప్రభుత్వాలు విద్యార్థుల చదువుల గురించి ఆలోచించి త్వరగా రావలసిన బకాయిలు విడుదల చేయాలి అని లేకుంటే ఈ బంధు కొనసాగుతుంది అని వాపోయారు..

## రైతులు, మిల్లర్లకు సహాయసహకారాలు అందిస్తాం




**సిద్దిపేట :** జిల్లాలో రైతులతో పాటు మిల్లర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ శిబిర కార్యాలయంలో 2025-26 కాటన్ మార్కెట్ యంఎస్పి క్రింద పత్తి సేకరణకు సంబంధించి మిల్లర్లు, అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ. మిల్లర్లు ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్ 4 ఎంపిక విధానం వలన జిల్లా పరిధిలో మొత్తం 22 జిన్నింగ్ మిల్లులకు గాను 10 మిల్లులో కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలిపారు. కాబట్టి మిల్లర్లతో పాటు రైతులు ఇబ్బందులకు లోనుకాకుండా ఇరువురికి సహాయ సహకారాలను అందించేలా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. రైతులు పండించిన పంటను మిల్లుల సామర్థ్యాన్ని బట్టి పూర్వ జిల్లాల పరిధిలో యాప్ ద్వారా రైతులే మిల్లులను ఎంచుకో గలుగుతారని, మిల్లుల సామర్థ్యాన్ని మించి పంట నిల్వలు ఉన్నట్లయితే, మరో మిల్లుకు పంటను తరలించుకునే అవకాశాన్ని సైతం రైతులకు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతు సమస్యల పరిష్కారానికి అధికారులతో పాటు మిల్లర్లు కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సుదూర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకొని ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సీసీఐ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సామర్థ్యం మేరకు మిల్లుకు పంటను తరలించాలని, తేమ శాతాన్ని పరిగణలోకి తప్పకుండా తీసుకోవాలని, అదేవిధంగా కొనుగోలు కేంద్రాలకు పంటను తరలించడానికి ముందే ఆరబెట్టుకొని ఆ తరువాతే కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డియం మార్కెటింగ్ నాగరాజు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు వద్ద సిమెంట్ లారీని ఢీకొన్న కర్ణాటక ఆర్టీసి బస్సు

### ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు

**హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లా తాండూరు వద్ద మరో కర్ణాటక ఆర్టీసి బస్సుకు ప్రమాదం జరిగింది. కరణ్ కోట్ సమీపంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీని కర్ణాటక ఆర్టీసి బస్సు ఢీకొంది. గుల్బర్గా నుంచి తాండూరు వైపు వస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ కు స్వల్ప గాయాలవ్వగా, ఓ ప్రయాణికుడికి తలకు గాయం అయింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నారు. వాహనాలను పక్కకు పోలీసులు తొలగించారు. బస్సు ప్రమాదాలు ఒకదానికొకటి వరుసగా జరుగుతుండడంతో తీవ్రంగా ఆశ్చర్యానికి, ఆవేదనకు గురిచేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు

## ఫీజు బకాయిలకోసం ఉన్నత విద్యామండలి ముట్టడి

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యా మండలిని ముట్టడించి ఆందోళన చేపట్టారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడిలో విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని, ఆంక్షలు, కోతల పేరుతో ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని క్రమంగా ఎత్తివేయాలనే కుట్ర జరుగుతోందని వేముల రామకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. "ప్రస్తుతం 14 లక్షల 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు గాలిలో దీపంలా మారింది. ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే త్వరలో లక్షలాది మంది విద్యార్థులతో విద్యార్థి మార్చ్ నిర్వహిస్తాం," అని రామకృష్ణ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 9 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేక ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు రోజురోజుకు పెరుగుతున్నారని ఆయన తెలిపారు. "ఫీజు రీయింబర్స్మెంట్పై ఆంక్షలు, కోతలు కాదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్ల జీతాల్లో కోతలు విధించండి," అని ఆయన డిమాండ్ చేశారు.

## వీఆర్ఏ వ్యవస్థ పునరుద్ధరణ అవసరం మాజీ మంత్రి జీవన్ రెడ్డి




**జగిత్యాల :** గ్రామస్థాయిలో ప్రభుత్వ ప్రాతినిధ్యం తగ్గిపోయిందని, మెరుగుపరచడానికి వీఆర్ఏ వ్యవస్థ పునరుద్ధరణ అవసరమని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో సోమవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ని వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలిశారు.తమ వీఆర్ఏ వ్యవస్థను పునరుద్ధరించాలంటూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలహీనపడిందని, ధరణి వ్యవస్థ కారణంగా భూ రికార్డుల్లో తారుమారులు జరిగి యాజమాన్య హక్కులపై వివాదాలు పెరిగాయని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం అంటే రెవెన్యూ యంత్రాంగమేనని, పంట నష్టాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలిచేది వీఆర్ఏ లేనని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుతం వీఆర్ఏ పోస్టులు రద్దు కావడంతో గ్రామస్థాయిలో ప్రభుత్వ ప్రాతినిధ్యం తగ్గిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చి భూ హక్కుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. అదే విధంగా వీఆర్ఏ వ్యవస్థను కూడా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.అలాగే, 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలకు వారసుల ద్వారా ఉద్యోగ భద్రత కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రికి నివేదిస్తానని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో వీఆర్ఏ పోస్టులు తిరిగి ఏర్పాటు చేస్తే, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని జీవన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com